PRAMUKHANDHRA 27th Year of Publication We carry the news and views of Telugus

27 వ సంవత్సరం

# ప్రముఖాంధ్ర



వ్యవస్థాపకులు
శ్రీ గోటేటి శ్రీరామారావు

₹.15
అక్టోబర్ 2021



THE ONE AND ONLY TELUGU MAGAZINE CIRCULATED IN USA, UK, CANADA, GERMANY, AUSTRALIA, MAURITIUS, SOUTH AFRICA, UAE, KUWAIT, SINGAPORE, MALAYSIA & ALL OVER INDIA



## ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలిగా

# డాక్టర్ వి. ఎల్. ఇందిరాదత్

తొమ్మిది దశాబ్దాలు ఘనచరిత్ర కలిగిన ఆంధ్రా చాంబర్ ఆఫ్ కామర్స్ 93వ వార్షిక సర్వ సభ్య సమావేశంలో ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు , కె సి పి సంస్థ చైర్మన్ డాక్టర్ వి ఎల్ ఇందిరాదత్ అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.

పలు ధార్మిక, సామాజిక, తెలుగు సంస్థలకు తన సహాయసహకారాలనందించే ఉదార గుణం గల మంచి మనిషి. అటు పారిశ్రామిక రంగంలోను, ఇటు సామాజిక రంగంలోను తనవంతు కృషినిజేస్తూ, ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలిగా తెలుగుభాషాభ్యున్నతికి విశేషమైన కృషి చేస్తూ అందరి మన్ననలను పొందుతూ, తాను ఎంచుకున్న లక్ష్యాన్ని అవలీలగా అధిరోహిస్తూ, ఉన్నత శిఖరాలనందుకుంటున్న శ్రీమతి ఇందిరాదత్‌గారికి ప్రముఖాంధ్ర శుభాకాంక్షలను తెలియజేస్తోంది.



# ప్రముఖాంధ్ర

## ప్రపంచ తెలుగుల మానస పత్రిక

అక్టోబర్ 2021

సంపుటి : 27 **322** సంచిక : 10




# మాతృభాష నెలా మొలకెత్తించేది?

## - జనులా? జననాయక ఘనులా? - గరుడ వాహనా! నీవే శరణు!!

**భా**షా రాష్ట్రం కోసం పోరాడిన వారం. భాషా రాష్ట్రం యేర్పడిన తరువాత యిప్పటివరకూ మాతృభాషను పట్టించుకున్నవారొకరూ లేరనడం బాధాకరం. భారత రిపబ్లిక్‌లో తొలి భాషా రాష్ట్రంగా తెలుగు రాష్ట్రమే యేర్పడినది. మాతృభాషను పట్టించుకోని తొలి రాష్ట్రముగా మారింది. ఇందుకు ప్రజలు కారకులా? ప్రభుత్వాలు కారకులా? ఎవరిని అనాలి? ఏమని అనాలి?

ఏ ప్రభుత్వ సహకారమూలేని అన్యరాష్ట్రాల్లోని తెలుగు ప్రజలు, మాతృ భాష కోసం తహతహలాడుతున్నారు; విదేశాల్లోని తెలుగువారు తమ భాషపై విరివిగా ఆసక్తి చూపుతున్నారు, మహాసభలు జరుపుతున్నారు. ఇహ రాష్ట్ర పరంగా చూద్దామంటే– పాలనా సౌలభ్యంగా యేర్పడిన ఇరు రాష్ట్ర ప్రభుత్వాల లోనూ సౌలభ్యం లేదు.

పాకిస్థాన్ ప్రభుత్వం భారత ప్రభుత్వంపై వైషమ్యం చూపినట్లు ఇరు రాష్ట్రాలలోని ప్రభుత్వాలు ఒకరంటే ఒకరు పొసగకుండా ఉన్నారు. రాష్ట్రం లోని నాయకులే, రాష్ట్ర నాయకులతో విభేదిస్తున్నారు. స్థానికంగా ఉండే రాజకీయాలు రాష్ట్రస్థాయి కెదిగాయి.

జనం మనంలో సమైక్యతా భావం ఉన్ననూ వర్ధిల్లడం లేదు. నాయకులు అడ్డగోలుగా ఉన్నారు. పెనంమీద మిడతల్లా జనం వేగిపోతున్నారు. రాష్ట్రాలకు అనుసంధానంగా ఉన్న జలశక్తి, జలవిద్యుచ్ఛక్తిల పోరాటం ఆరంభమైంది. రాష్ట్రాభివృద్ధి కోసం ఆరాటపడవలసిన నాయకులు పోరాట ఆరాటాన్ని పెంచుకుంటున్నారు.

**చేయెత్తి జైకొట్టు తెలుగోడా**
**గతమెంతో ఘనకీర్తి కలవోడా–**
**వీర రక్తపు ధార వారవోసిన సీమ**
**వెలనాడు నీదేరా పలనాడు నీదేరా**

–అన్న తెలుగు కవి వేములపల్లి శ్రీకృష్ణ మేలుకొలుపు వేడికోలయింది.

ఏ నాయకులున్నప్పుడు ఆ నాయకులకు జేజేలు పలికే జనం ఉండి నపుడు, వార్వారి గళముల్లో వేర్వేరు స్వరం పలుకదు.

ఫాస్టుఫుడ్‌లు అలవాటైనవారికి, పచ్చళ్ల అన్నం యెందుకు రుచిస్తుంది? వరి పండించే చాలా ఊళ్ళను పట్టణాలు కబళించేసాయ్. 'అ–ఆ' లను నల్లబోర్డులపై వ్రాసి బోధించే పాఠశాలలు కనుమరుగయ్యాయి. పంతుళ్లు మారారు. A B C D పట్టికలను వేలాడించే టీచర్స్ వచ్చారు. గురువుల పాఠ్య విధానం, బోధనం గురివిందగింజంత ప్రమాణం కూడా లేదు. చదువుకున్న వాడు కాకరకాయను కీకరకాయ అన్నట్లు– నవంబర్1న కాదు జూన్ 2న రాష్ట్రవతరణోత్సవం జరుపుకుందామంటున్నారు. చైత్ర వైశాఖములనే తెలుగు మాసపు పేర్లను మరచిపోయినట్లే, అక్టోబర్ 1, నవంబర్1లను మరిచిపోయే రోజులు వస్తున్నాయి.

ఒకటి తరువాత వచ్చేది రెండే! తెలుగు రాష్ట్రాలుండేదీ రెండే! ఇరువురు ముఖ్యమంత్రులూ, ఇరువురు స్పీకర్లూ, ఇరు శాసనసభలూ ఉన్నాయి. ఒకటిగా ఉండని వారికి ఒకట్లు జ్ఞాపకం ఉండవు. ఇలాటప్పుడు ఇరుకున పడేది నదులూ, నదాలూ, జనపదాలూ, భాష యిరుకున పడకేంచేస్తాయ్. 'భాష' అనే రెండక్షరాలు విడిపోతున్నాయి. 'హే భగవాన్ నీకు ఆసనం వేసి కూర్చోపెడదామంటే– అతి బలిష్ఠుడైన గరుత్మంతుడు నీ వాహనం! నిన్నాభరణంతో మురిపింప చేద్దామంటే కౌస్తుభం నీ ఆభరణం! కనకమయుణ్ణి చేసి ఆనందిద్దామంటే లక్ష్మీదేవి కన్నా మించిన సిరేమున్నది?

నీవు వాక్కునకు అధిపతివి. కావున వాక్కులు మాతృభాషను పలికేట్లు చేయాలంటే నీవు దివి నుంచీ భువికి దిగిరావాలి. మా రాజధాని నిర్మాణం జరగాలి. వరిచేలు పండాలి; మా అమ్మ వండాలి, మా కడుపు నిండాలనే ధ్యాస మాకు కల్పించు. దేశమంటే మట్టికాదు; దేశమంటే మనుష్యులు. మనుష్యుల నోట మట్టికొట్టే, ఆలోచనల్ని కలుగనీయకు! సుజలాం సుఫలాం మలయజశీతలామ్; సస్య శ్యామలాం వందే మాతరమ్! అనే వాగ్విలాస మందహాసుల్ని చెయ్యాలి ప్రభూ!



బుధజన విధేయుడు

**– గోటేటి శ్రీరామారావు**

(డిసెంబర్ 2014)


Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# సీతాపతేరామ! రాధాపతే కృష్ణ - శ్రీ రుక్మిణీ సత్యభామాపతే! నవ దుర్గాయై నమః పార్వతీపతయే నమః

## శ్రీమాత్రే నమః

**ఈ** జగతికి మూలం అమ్మ! ఈ సృష్టికి మూలం అమ్మ! ఈ చరాచరముల ప్రగతికీ అమ్మే! ఎవరెవరే విద్వాంసులైనా, విజ్ఞానవంతులైనా, సారస్వత సాహితీ సంపన్నులైనా 'అమ్మ' అనుగ్రహం లేకపోతే కాలేరు!

'ఓమ్' తొలిగా పుట్టింది. 'ఓం' ప్రారంభంతోనే సర్వమంత్రాలూ ప్రారంభ మవుతున్నాయ్! అగ్నికి జరిగే సర్వమంత్రాల్లోనూ, 'స్వాహా' అనడం జరుగుతూంది. ఆ 'స్వాహా' ఉచ్చారణంలోను ఓ అమ్మ ఉన్నది. నా చిరుజ్ఞానం ప్రకారం ఆమె అగ్ని భార్యయని నా విశ్వాసం. ఓం అగ్నయే నమః అని అగ్ని సతిని తలుస్తూ అంటున్నారేమో ఆమే అమ్మ అన్నది. నా విశ్వాసం.

## శంభు ఉమాపతియే నమః

**లక్ష్మీ గణపతియే నమః** సర్వగణాలకూ, చరాచరాలకూ మహావిష్ణువే కారణం- అని మహావిష్ణుస్వరూపుడైన గణనాథుని తలుస్తున్నాం.

దుర్గమ్మ మాయమ్మ! అలివేలు మంగమ్మ మాయమ్మ, సీతమ్మ మాయమ్మ, మహా లక్ష్మి మా యమ్మ! చదువుల తల్లి సరస్వతి మా యమ్మ - అందుకే పోతనగారు త్రిగుణ స్వరూపులైన అమ్మలు ఒకటే- ముగురమ్మల మూలపుటమ్మ చాలా పెద్దమ్మ, సురారులమ్మ' అని ఒకే పద్యంలో 'అమ్మ' స్వరూపాన్ని ఏకత్వాన్ని నిర్ధారించినట్టు చెప్పారు.

ఆ 'అమ్మ' అనుమతి లేనిదే గడ్డిపరకైనా కదలదు. భగవంతుడైనా కదలడు. శివుడు తన శరీరంలోనే పార్వతిమాతకు మాత్రమే అర్ధభాగమొసగారు. విష్ణువు (వేంకటరమణుడు) హృదయం మహాలక్ష్మికి స్థానం యిచ్చారు. రాముని అంతరంగంలోనే సీతామహాలక్ష్మి ఉన్నది. (రావణాసురుడు యెత్తుక పోయినది ఛాయా మాత్రపు సీతనేనని బుధజనులు గ్రహించాలి. కృష్ణుని శరీ రంలోనుంచే రాధపుట్టింది. అష్టభార్యలూ పదునారువేల అర్థాంగులూ ఆయన అంశలే! విష్ణునాభినుంచే బ్రహ్మజన్మించారు. విష్ణు పాదాల్నుంచే గంగ పుట్టింది. ఆ తల్లి పుట్టిన తరంగతీవ్రతను పరమశివుడు శిరమున దాల్చాడు- అంటే ఆయన మరో జగత్ప్రభువుగా ఆయన శిరమున దాల్చాడు.

లౌకిక ప్రపంచంలో 'అమ్మ' లేనిదే సృష్టిలేదు; అమ్మ క్షీరమివ్వనిదే శిశువు బ్రతుకదు. ఆడబిడ్డకయినా, మగబిడ్డకయినా జన్మనిచ్చేది అమ్మే!

'అమ్మా'తోనే సృష్టి ఉన్నది, అమ్మతోనే శరీరపుష్టి ఉన్నది; ఎదుగుదల ఉన్నది. పరమేశ్వరుడైన పరమశివుడు కూడా పార్వతిని 'ఓమా-ఉమా' యని పిలిచాడని పురాణప్రవక్తలు చెబుతారు. రామకృష్ణ పరమహంస తన సతీమణి 'శారదామాత'ను తల్లిగా భావించి, పాదపూజచేసిన, చరిత్ర ఉన్నది. శంకరాచార్యులు వారు 'అమ్మ' అనుమతితోనే సన్యాసస్వీకారం చేసి, దేశసంచారం చేసారు. అమ్మకిచ్చిన మాటకోసం ఆమె దేహం చాలించే ముందువచ్చారు. ఆమె కడగంటి చూపుకు ప్రశాంత కల్పించారు. అంతక్రితం అమ్మ స్నానం చేయడం కోసం నదికి వెళ్ళడం కష్టపడుతుందని గ్రహించి 'అమ్మ' దరికే నది వచ్చేట్లు జలమాతను జన్మయిచ్చిన మాత సన్నిధికి తెచ్చారు. అమ్మయే సర్వసం! అమ్మయే సర్వం. అమ్మ వినా జగతీలేదు, జగ(న) ప్రగతీ లేదు అమ్మలను పూజించడానికే ఆశ్వయుజ మాసం వచ్చింది. ఇది ముగురమ్మలను పూజించే ముచ్చటైన, ముక్తి ప్రదమాసం. ముఖ్యంగా జ్ఞానప్రదేవతయైన సరస్వతీ దేవిని కొలవాలి; కాళిని కొలవాలి. పదిలోపు బాలికలను కొలవాలి, సుమంగళి (పుణ్యస్త్రీలు)లను పూజించాలి ఇలా ఇలా 'అమ్మ' ప్రతిరూపాలను అర్చించాలి. దశహర, దశహోర దశారాత్రములు అర్చిండమే దసరా!

దుర్గామాతనే నవదుర్గలుగా నవరాత్రుల్లో కొలవడం ఆచారం. ముఖ్యంగా దసరామహోత్సవాల్లో సరస్వతి ప్రధానదేవత, మహాలక్ష్మీ, పార్వతీ నవదుర్గలు అమ్మల్లోనివారే!

**ప్రథమాశైలపుత్రీచ- ద్వితీయబ్రహ్మాచారిణీ**
**తృతీయ చంద్రఘంటేతీ - కూష్మాండేతి చతుర్థికీ**
**పంచమా స్కంధమాతేతి- షష్టా కాత్యానేతిచ**
**సప్తమా కాళరాత్రీచ- అష్టమా చాతి భైరవీ**
**నవమా సర్వసిద్ధిశ్చాత్ - నవదుర్గా ప్రకీర్తి తాః** -అన్నారు.

1. **ఓం శైలపుత్రీనమః**
2. **ఓం బ్రహ్మచారిణై నమః**
3. **చంద్రఘంటాయై నమః**
4 **ఓం కూష్మాండాయై నమః**
5. **ఓ స్కంధమాత్రే నమః**
6. **ఓం కాత్యాయైన్యై నమః**
7. **ఓం కాలరాత్రై నమః**
8. **ఓం మహా గౌర్యై నమః**
9. **ఓం సిద్ధిదాత్రై నమః**

**ఓం దుం దుర్గాయై నమః-** అని నవదుర్గలనూ భక్తితో కొలవాలి.. దుర్గాదేవి ప్రసన్నయై 'ధర్మరాజా! రానున్న కురుపాండవ సంగ్రామంలో నీకు విజయం లభిస్తుంది. నా అనుగ్రహంతో కౌరవసేనను హతమార్చి నిష్కంటకంగా రాజ్యాభిషిక్తుడవై పాలిస్తూ సోదరులతో సర్వసుఖాలూ పొందగలవు. మీకు ఆయురారోగ్యాలను ప్రసాదిస్తున్నాను' అంటూ దుర్గామాత ఆశీర్వదించింది. ధర్మనందనా! నువుచేసే దుర్గాస్తుతిని చేసేవారందరికి సర్వ పాపాలూ నశిస్తాయి. రాజభోగం! రోగరహితమైన ఆరోగ్యం, పుత్రపౌత్రాభి వృద్ధి కలుగుతుంది. పరదేశాల్లో ఉన్నవాడు కానీ, స్వదేశంలో ఉన్నవాడు కానీ, సంగ్రామం చేసేవాడు కానీ, శత్రుపీడితుడుగానీ, ఘోరారణ్యవాసిగానీ, దుర్గమప్రదేశ సంచారికానీ, సముద్రమధ్యగాన, పర్వతాలలో ఉన్నవాడు కానీ, స్తుతించిన మరు క్షణంలో సర్వబాధల్నుంచీ విముక్తుడై సుఖములను పొందుతాడు. ఈ స్తుతిని భక్తితో శ్రవణం చేసినా, పఠించినా సర్వకార్యాలూ సిద్ధిస్తాయి.

విరాటనగరంలో నివసించే సంవత్సరకాలమూ నగరవాసులుకానీ, కౌరవులు గానీ, వారి దూతలుగానీ, మిమ్ముగుర్తించకుండా ఉండేట్టు అనుగ్రహిస్తున్నాను. ఆ భారం నాదేనని అంటూ ఆ తల్లి అనుగ్రహించింది! అనుగ్రహించినట్లే జరిగింది! అందరికీ జరుగుతుంది!!

**తథాస్తు! శుభమస్తు**

**సకల సంపదల ప్రాప్తిరస్తు!**

# బి.ఇ.డి కాలేజి

కిందటి వారం రాజమండ్రి వెళ్ళినప్పుడు బి.ఇ.డి కాలేజికి కూడా వెళ్ళాను. ఇప్పుడు దాన్ని 'గరిమెల్ల ఇన్ స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్సడ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషన్' అని పిలుస్తారు. మేమంతా ఆ పిల్లలతో మాట్లాడుతుండగా, అక్కడ గోడమీద ఉన్న ఒక పటాన్ని చూపించి 'ఆయన ఎవరు' అని ప్రాంతీయ సంచాలకుడు పిల్లల్ని అడిగాడు. వెనకనుంచి ఒకపిల్లవాడు 'గరిమెళ్ళ సత్యనారాయణ' అని చెప్పాడు. ఆ పిల్లవాణ్ణి ముందుకు రమ్మన్నాను. గరిమెళ్ళ ఎవరు అని అడిగాను. దేశభక్తుడు, కవి, స్వాతంత్ర్యంకోసం పాటలు పాడాడు, జైలుకు వెళ్ళాడు అని చెప్పాడు. ఆయన ఎక్కడివాడు అని అడిగాను. 'శ్రీకాకుళం' అని చెప్పాడు. నువ్వు ఎక్కడినుంచి వచ్చావు అని అడిగాను. శ్రీకాకుళం అన్నాడు. మరి ఆయన చిత్రపటం ఇక్కడ ఎందుకుంది అని అడిగాను.

ఎందుకంటే ఆయన ఇక్కడ చదువుకున్నాడు. ఈ కళాశాలకు ఆయన పేరే పెట్టారు కాబట్టి అన్నాడు.

నాకు చెప్పలేని గగుర్పాటు కలిగింది. గరిమెళ్ళ ఈ కళాశాలలో చదువుకున్నాడా! ఈ కళాశాల పేరు 'శ్రీ గరిమెళ్ళ సత్యనారాయణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్సడ్ స్టడీస్ ఇన్ ఎడ్యుకేషనా!' నా పర్యవేక్షణలో ఉన్న ఒక ప్రతిష్టాత్మక కళాశాలకు ఒక మహాకవి, ప్రజాకవి పేరు పెట్టారని, నాకిన్నాళ్ళూ తెలియనందుకు, నేను పాఠశాల విద్యాశాఖ అధిపతిగా రెండేళ్ళుగా పనిచేస్తున్నప్పటికీ, ఇప్పటిదాకా తెలుసుకోనందుకు సిగ్గుతో చచ్చిపోయాను. కాని మరుక్షణమే గర్వంతో పునర్జన్మించాను.

ఆయన రాసిన పాట ఒకటి పాడగలవా అనడిగాను.

ఆ పిల్లవాడు గుర్తుచేసుకోడానికి ప్రయత్నించాడు. కాని నేను ఆగలేకపోయాను.

'మాకొద్దీ తెల్లదొరతనమూ..' విన్నావా ఈ పాట అనడిగాను. కాని అతడి జవాబు కోసం ఆగకుండానే వెంటవెంటనే ఆ పంక్తులు బిగ్గరగా వినిపించాను.

**'మా కొద్దీ తెల్లదొరతనమూ-దేవ**
**మా కొద్దీ తెల్లదొరతనమూ'**
**'మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించే**
**మా కొద్దీ తెల్లదొరతనమూ'**
**పండ్రెండు దేశాలూ పండుతున్నాగానీ**
**పట్టెడన్నమె లోపమండీ**
**ఉప్పుముట్టుకుంటే దోషమండీ**
**నోటమట్టిగొట్టీ పోతడండీ, అరె**
**కుక్కలతో పోరాడీ కూడుతింటామండీ!**
**మా కొద్దీ తెల్లదొరతనమూ- దేవ**
**మా కొద్దీ తెల్లదొరతనమూ'**

పిల్లలు చప్పట్లు కొట్టారు. కాని నా ఉద్వేగం ఉపశమించలేదు. గరిమెళ్ళ ఇక్కడ ఉపాధ్యాయ శిక్షణకోసం చేరాడుగానీ, 150 పంక్తులకు పైగా సాగే ఈ గీతం రాయగానే ఆయనకు కలెక్టరునుంచి కబురు వచ్చింది. తన సమక్షంలో ఆ పాట పాడమన్నాడు కలెక్టరు. ఆయన ఎలుగెత్తి ఆలపించాడు. 'తెలుగు అర్థం కాని నాకే ఈ గీతం వింటూంటే ఒళ్ళంతా మంటలు పుడుతున్నట్టుంది, ఇది వింటే ప్రజల్లో ఎంత విప్లవం చెలరేగుతుందో ఊహించగలను' అన్నాడు కలెక్టరు. వెంటనే ఆ కవికి ఏడాది జైలు శిక్ష వేసాడు. ఒక పాట రాసినందుకు జైలు శిక్ష బహుమానంగా పొందిన మొదటి కవి బహుశా భారతదేశంలో గరిమెళ్ళ మాత్రమేనేమో.

అయితే ఆ రోజు రాజమండ్రి బి.ఇ.డి కళాశాల నాకు అందించిన పులకరింత అదొక్కటే కాదు. మరొక మహనీయుడు, దక్షిణభారతదేశంలో రాజద్రోహ నేరం మీద మొదటిసారిగా శిక్షకు గురయిన గాడిచెర్ల హరిసర్వోత్తమ రావు కూడా ఆ కళాశాలలోనే చదువుకున్నాడని కూడా అప్పుడే తెలిసింది. వందేమాతరం రోజుల్లో ఆ కళాశాలలో ఆయన నేతృత్వంలో విద్యార్థులు చూపించిన అసమ్మతి జాతీయోద్యమంలో విద్యార్థుల తిరుగుబాటుకు సంబంధించిన మొదటి సంఘటన అని కూడా చెప్పవచ్చు.

'సర్వోత్తమ జీవితం' లో (పే. 35-36) మాదలవీరభద్రరావుగారు ఆ ఘట్టాన్నిట్లా వివరించారు:

'...బిపిన్ చంద్ర పాల్ ఉద్రేకపూరిత ఉపన్యాసాలివ్వగల వక్త. వీరి ఉపన్యాసాలతో ఆంధ్రవిద్యార్థిలోకం ఉద్రిక్తమైపోయింది. వారు జాతీయ భావ ప్రపూరితులైనారు. రాజమండ్రి విద్యార్థులు వందేమాతరం బిళ్ళలు ధరించి పాల్ ఉపన్యాసానంతరం బ్రహ్మాండమైన వీడ్కోలిచ్చారు. ఆ బిళ్ళలతోనే విద్యార్థులు కళాశాలకు రావటం కాలేజి ప్రిన్సిపాలుగా ఉన్న మార్కు హంటరుకు కన్నుగుట్టినట్టయింది. ఆ చిహ్నాలు తీసివేయమని హుంకరించాడు. కాని అతని మాటనెవరూ వినిపించుకోలేదు. పాఠశాలనుండి వెళ్ళిపొమ్మని ఆజ్ఞాపించాడు. కాని విద్యార్థులు కేకలు వేస్తూ గేలి చేయసాగారు. హరిసర్వోత్తమరావుగారు అక్కడకు వచ్చి వారిని శాంతపరిచారు. విద్యార్థులందరికీ ఆయనంటే ఎంత అభిమానమో అర్థమయింది. ఈ విద్యార్థుల ఆందోళనకంతా రావుగారే కారణమని శిక్షిస్తానన్నాడు హంటర్. ప్రిన్సిపాల్ మరొక విద్యార్థిని కొట్టబోగా రావుగారు ముందుకొచ్చి 'అతన్ని కొట్టబోకండి' అని వారించాడు. హరిసర్వోత్తమరావుగారిని బడిలోనించి తీసివేశానన్నాడు. ఇది విని ఆర్ట్సు కాలేజీ, ట్రయినింగు కాలేజీ విద్యార్థులంతా బయటికి వచ్చి రావుగారిని అనుసరించారు. పవిత్ర గోదావరిలో స్నానం చేసి దీక్షాకంకణం ధరించారు. మరల కళాశాలలో కాలుపెట్టమని శపథం చేసారు. ఈ విధంగా రాజమహేంద్రవరం విద్యార్థులు తెలుగుదేశంలో వందేమాతరం ఉదయ్యానికి మార్గదర్శకులైనారు..'

ఇటువంటి చరిత్రకు సాక్షిగా నిలిచిన ఆ కళాశాలలోనే చలంగారు కూడా అధ్యాపకుడిగా పనిచేసారని గుర్తు చేసుకున్నాను. ఆ రాత్రి విజయవాడకు తిరిగి వస్తున్నంతసేపూ ఆ ఉద్యమకారులు, సంస్కర్తలు నా మనసులో పదేపదే మెదుల్తూ ఉన్నారు. అటువంటి చారిత్రాత్మక కళాశాలకు నేనేమి చెయ్యగలనా అని ఆలోచిస్తూ ఉన్నాను.

కొంతసేపటికి ఆ ఆలోచనలు కూడా అదృశ్యమై గరిమెళ్ళ ఒక్కడే నా మనసంతా నిండిపోయాడు. యూ ట్యూబ్ తెరిచి మాకొద్దీ తెల్లదొరతనమూ పాట ఎక్కడెక్కడ ఎవరు పాడారా అని చూడటం మొదలుపెట్టాను. ఏమాశ్చర్యం! పోయిన ఏడాది కొత్త పాఠ్యపుస్తకాలు రూపొందిస్తున్నప్పుడు, అయిదవ తరగతి తెలుగు వాచకంలో ఈ పాట పొందుపరిచాం కదా, ఎందరో ఉపాధ్యాయులూ, ఉపాధ్యాయినిలూ ఆ పాట తాము పాడిందీ, తమ పిల్లలూ పాడిందీ, ఆ పాటకు నాట్యం చేసిందీ ఎన్నో వీడియోలు యూట్యూబ్ లో పెట్టినవి కనబడటం మొదలుపెట్టాయి. నాకు చెప్పలేని తృప్తి కలిగింది. ఆ మహనీయుడి పాట పాఠ్యపుస్తకాల్లో భాగంగా మరొకతరానికి చేరవెయ్యగలిగానన్న సంతోషం నా మనసంతా నిండిపోయింది.

**- శ్రీ వాడ్రేవు చిన్న వీరభద్రుడు గారు,** ఐ.ఏ.ఎస్

We Provide your comfortable Stay and Tasty Food Hospitality

b-d

Bhimas Deluxe Hotel

(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)

34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

## పరమార్థ కథలు

## శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు

# సుఖమునకు రాజబాట



పూర్వమొకపుడు ఒకానొక వర్తకుడు కొంత డబ్బును మూట కట్టుకొని యాత్ర చేయుటకై బయల్వెడలెను. దారిలో అచటచట సత్రమునందో, దేవాలయమునందో విశ్రమించుచు ప్రయాణము కొనసాగించుచుండెను. వర్తకుని యొద్దగల డబ్బుమూట జూచి మఱియొకనికీ దానిని తస్కరించవలెనను దుర్బుద్ధి జనించి స్నేహితునివలె నటించి మెల్లగా అతని చెంతచేరెను. ఇరువురును పరమమిత్రులవలె మెలగుచు యాత్ర సల్పుచుండిరి.

ఒకనాటిరేయి ఇద్దరును ఒక సత్రమునందలి గదిలో పరుండి వర్తకుడు గాఢనిద్ర పోవుచుండ, ఆ కపట మిత్రుడు నెమ్మదిగా లేచి డబ్బుమూటకొరకై గది యంతయు వెతకెను. వర్తకుని పెట్టె, సంచులు, చొక్కా మూటలు అన్నియు విప్పి చూచెను. కాని డబ్బుమూట కనిపించులేదు. మరల మరల వెతకెను. కాని కనిపించ లేదు. మరుసటిరోజు ఉదయమున తన స్నేహితునితో మాట్లాడుచు మాటల సందర్భములో "రాత్రి మీ డబ్బుమూట ఎచట దాచితిరి?" అని ప్రశ్నింప అతడు 'నీ దిండు క్రిందనే' అని జవాబిచ్చెను. కపట మిత్రుడు అత్యాశ్చర్యపడెను. వర్తకుడు తన మిత్రుని దొంగగా గ్రహించి అతడెట్లయినను తన ధనమును అపహరించునని తలంచి ఆ మూటను ప్రతిరోజు ఆ మిత్రుని తల (దిండు) క్రిందనే దాచుచుండెను. ఏలయనగా దొంగ అన్నిచోట్ల వెదకునుగాని తన తల (దిండు) క్రింద వెతకడు. వర్తకునకో, దొంగలను మేపు అభ్యాసము కలదు కనుక తన ధనరక్షణ కొరకై యీ చక్కని ఉపాయము అవలంబించెను.

ఆ ప్రకారమే జీవుడు బ్రహ్మానందవారాశిని తన హృదయము నందే ఉంచుకొని ప్రపంచమంతయు ఆనందము కొరకు వెతకుచున్నాడు. కాని యెంత వెతికినను ఆ శాశ్వతానందమాతనికి బయట ఎచటను లభించుటలేదు. అది అంతరంగముననే కలదు. ఆ రహస్యమతనికి తెలియక అజ్ఞానవశమున బయట తుచ్ఛసుఖములకై తిరుగాడుచున్నాడు, "జవిన్దత్యాత్మని యత్సుఖమ్జ", "జసుఖమక్షయ మశ్నుతే, యోఽన్తః సుఖోజ" ఇత్యాది వాక్యముల ద్వారా శ్రీకృష్ణపరమాత్మ అక్షయసుఖము లోపలనే కలదని స్పష్టము చేసియున్నాడు.

ప్రతిరోజు గాఢనిద్రపోవునపుడు బాహ్యవస్తువు లన్నింటిని మఱచి, సంకల్పము లను కూడ వదలి జీవుడు అవిచ్ఛిన్నమగు (Homogeneous) సుఖము తనయందే అనుభవించుచుండుట చూచుచున్నాము కదా! ఆ సమయమున ఎట్టి దుఃఖము కూడ స్ఫురణకు రాక జీవునకు పరమశాంతి కలుగుచుండును. అజ్ఞానస్థితిలో మనస్సు యొక్క తాత్కాలిక ఉపశమనరూపమగు సుషుప్తియందే ఇంత సుఖము జీవునకు అభ్యంతరమున లభించుచుండ ఇక జ్ఞానస్థితిలో మనస్సు యొక్క శాశ్వత ఉపశమనరూపమగు సమాధిస్థితియందెంత సుఖము లభించగలదు?! కాబట్టి అట్టి అనంతాత్మసుఖప్రాప్తికై బాహ్య అల్పసుఖములను జీవుడు పరిత్యజించవలసి యుండును. దానినే విషయవిరక్తి యందురు. కొంత త్యాగమవలంభించి ఈ కార్యమును సాధించినచో ఫలితము అఖిండదైవప్రాప్తియే.

కావున విజ్ఞులగువారు తమ అమూల్య మానవ జన్మను సార్థకపరచుకొనుట కొరకు ప్రయత్నశీలురై, విషయసుఖములను పరిత్యజించుచు ఇంద్రియమనో నిగ్రహమును సాధించుచు, కామక్రోధాదులవేగమును అణచుచుందురు. జీవితకాలము అతిస్వల్పము. తెలిసి కొనవలసిన ధర్మములా పెక్కుగలవు. ఆచరించవలసిన సాధనలా అనేకము లున్నవి. విఘ్నములా లెక్క లేనన్ని వచ్చి పైబడుచున్నది. ఇట్టి స్థితిలో జీవుడు ఎంతత్వరితముగ తన లక్ష్యమును సాధింపగల్గునో అంత శ్రేయస్కరము. మృత్యువు ప్రతినిముషము జీవుని కబళించుటకై ప్రక్కనే వేచియున్నది. వార్ధక్య, రోగాదులు హుంకరించుచు మీదపడబోవుచున్నవి. కావున వానివలన అపకారము కలుగక పూర్వమే, మృత్యువు దాపురించక మునుపే, ఇంద్రియముల శక్తి ఉడుగక పూర్వమే వైరాగ్య శమదమాది సాధనలను అభ్యసించి స్వస్వరూపానుభవమును పొందవలసి యుండును.

మరణించిన పిదప మానవజన్మ వచ్చునను "గ్యారంటీ" లేదు ఆ ప్రకారముగ భగవంతుడు మనకు హామీపత్ర మేదియు నివ్వలేరు ఒకవేళ ఇతరలోకములందు జన్మించితిమా, అచట పరమార్థసాధనల అనుగుణమైన వాతావరణము యుండదు, అవి యన్నియు భోగభూములే గాని యోగభూములు కావు. కర్మభూములంత కంటెను కావు. భూలోకమొకటియే చక్కని కర్మక్షేత్రము. పాపము చేసినచో నరకము నకు, పుణ్యము చేసినచో స్వర్గమునకు, జ్ఞానము పొందినచో మోక్షమునకు ఇక్కడినుం డియే జీవునకు నేరులో టిక్కెట్టు (Passport) దొరుకును. తన గమ్యమును తాను ఇచటనే నిర్ణయించు కొనవచ్చును.కాబట్టి త్వరలో సద్గురువు నాశ్రయించి తరణోపాయమును ఎఱుంగవలెను. అదియేదియో గురోర్గురువైన శ్రీకృష్ణమూర్తి గీతయందు వెల్లడించియే యున్నాడు.

**శక్నోతీహైవ యఃసోఢుం ప్రాక్ఛరీరవిమోక్షణాత్?**
**కామక్రోధోద్భవం వేగం సయుక్తస్ససుఖీనర:? (5-23)**

పరమార్థసుఖము ఎవనికి లభించును? కామక్రోధాదులను నిగ్రహింపగలిగిన వానికి. వానిని ఎపుడు నిగ్రహించవలెను? ఈ శరీరము పతనము కాకపూర్వమే అనగా మృత్యువాసన్న మగుటకు ముందే ఎచట నిగ్రహించవలెను? ఇచటనే, ఈ మానవజన్మ యందే, ఈ భూలోకముననే (ఇహైవ) ఇవ్విధముగ పరమాత్మ అధ్యాత్మ సుఖప్రాప్తికై రాజబాటను చూపెను. కోరికలను తగ్గించుకొనవలెను. ఆశలను విడనాడవలెను. విషయసుఖములను పరిత్యజించవలెను. భోగాభిలాషను దూరీకృత మొనర్చుకొనవలెను. కామక్రోధాదులను అణచవలెను. అత్తఱి ప్రతిజీవికిని తన హృదయస్థమగు ఆత్మా నందరూప అఖండసుఖము చక్కగా అనుభూతమగును.

**నీతి:-** పరిపూర్ణమగు సుఖము తనయందే కలదు. మనస్సును నిగ్రహించి, నిర్మల మొనర్చి అంతర్ముఖముచేసి అట్టి సుఖమును జీవుడు అనుభూత మొనర్చుకొనవలెను.




# ఎం.ఎల్.వసంతకుమారి



మదరాస్ లలితాంగి వసంతకుమారి అనే ఎం.ఎల్. వసంతకుమారిగారు 1928 జూలై మూడో తేదీన జన్మించారు. తమిళంలో తండ్రి పేరులోని మొదటి అక్షరంగా (ఇనిషియల్) రాసుకునే ఆరోజుల్లో అందుకు బదులు తల్లి పేరుని మొదటి అక్షరంగా చేసుకున్నవారే ఎం.ఎల్. వసంతకుమారి.

ఆమె తండ్రి పేరు అయ్యాసామి అయ్యర్. అమ్మ లలితాంగి. వీరిద్దరూ గాయకులే. అలాగని తండ్రేమీ వేదికలెక్కి పాడేవారుకాదు. నేర్పించేవారు. సేవా సదన్లో పని చేస్తుండేవారు. ఆయనకు ఉత్తర భారత దేశ సంగీతంపై మక్కువెక్కువ. ఈ కారణంగా ఆయన కలకత్తా, ముంబై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్ళి హిందుస్తానీ సంగీతం నేర్చుకున్నారు. రాజాయి, ముసిరి, అరియకుడి రామానుజం, మహారాజపురం, వంటివారు ఆయన దగ్గర కొన్ని కీర్తనలు నేర్చుకున్నారు. ఈ క్రమంలోనే ఆయన లలితాంగిని కలవడం, ఇష్టపడటం, పెళ్ళి చేసుకోవడం జరిగి పోయాయి. ఆమె కచ్చేరీలు చేసేవారు. తొలి రోజుల్లో ఆమె కోయంబత్తూరు తాయిదగ్గర శిష్యరికం చేశారు. అనంతరం ఫ్లూట్ సుబ్బరామన్ దగ్గర పాటలు నేర్చుకున్నారు. ఆ తర్వాత ఆమె భర్త దగ్గరే శిక్షణ పొందారు ఆస్థ్మాతో బాధపడటంవల్ల చాలా బాధపడుతూ వచ్చిన ఆమె నలబై ఏళ్ళకే పాడలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఆమె ఆయనకు రెండో భార్య. కనుక వారి మధ్య ఇరవై ఏళ్ళపైనే తేడా ఉండేది. ఆమె 1955లో తన 49వ ఏట మరణించారు. ఆయన 1963లో కన్నుమూశారు.

ఎనిమిదో ఏట నుంచే వసంతకుమారిగారు తన తల్లితో కలిసి పాడుతూ వచ్చారు.

అప్పట్లో చిన్నపిల్లలకోసం ఆకాశవాణిలో పాడే అవకాశం ఇవ్వడంతో వసంత కుమారి ఆ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. పదిహేను నిముషాలు పాడటానికి పదిహేను రూపాయలిచ్చేవారు.

వసంతకుమారి తల్లిదండ్రులకు పురందరదాస్ మీద అచంచలమైన భక్తిప్రపత్తులుండేవి. కనుక పురందర దాస్ కీర్తనలను పాడి ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి తీవ్ర కృషి చేశారు. అయితే తమ కుమార్తెను డాక్టరుగా చూడాలనుకుని తల్లిదండ్రులు ఆమెను చెన్నైలో ఓ కాన్వెంట్ స్కూల్లో చేర్చారు. ఇంటిదగ్గర సంగీతంలో శిక్షణ కొనసాగించారు.

ఓమారు లలితాంగి కచ్చేరీలో పాడుతుండగా వసంతకుమారి కూడా కలిసి పాడారు. ఆమె స్వరం మధురంగా ఉండటంతో నాటి ప్రముఖ సంగీత విద్వాంసుడు జి.ఎన్.బాలసుబ్రమణ్యన్ వసంతకుమారిని తన శిష్యురాలిగా చేసుకోవాలను కున్నారు. ఈ విషయమై ఆవిడ తల్లిదండ్రులతో మాట్లాడారు. వాళ్ళు సరేననడంతో వసంతకుమారి జీవితంలో అది ఓ గొప్ప మలుపే అని చెప్పుకోవచ్చు. జీ.ఎన్.బికి శిష్యురాలై సంగీతంలోని మెకువలన్నింటినీ తెలుసుకున్నారు. అంతేకాదు, జీఎన్బీకి మొట్టమొదటి శిష్యురాలైన ఘనత వసంతకుమారిగారికి దక్కింది.

1940లో తల్లితో కలిసి సిమ్లాలో కచ్చేరీ చేసిన ఎం.ఎల్.వి ఆ తర్వాత బెంగళూరులో విడిగా పాడే అవకాశం దక్కింది. ఆ వెంటనే ఆవిడ పాడిన గ్రామ్ ఫోన్ రికార్డు కూడా విడుదలైంది. స్వాతితిరునాళ్ తోడి రాగంలో కృతి అయిన సరసిజనాభ సోదరి... అని ఆమె లలితంగా పాడి అందరి మన్ననలు పొందారు.

గురువుగారి ద్వారానూ అనేక అవకాశాలు పొందిన ఎంఎల్వీ ఓ గొప్ప గాత్ర విద్వాంసురాలిగా ప్రత్యేక స్థానాన్ని సంతరించుకోవడానికి దాదాపు పదేళ్ళు పట్టింది. సినిమాలో పాడే అవకాశాలూ వచ్చాయి. ఆవిడ గానమాధుర్యానికి ముగ్ధుడై ఎం.కె. త్యాగరాజ భాగవతార్ తాను నటించిన రాజముఖి చిత్రంలో పాడే అవకాశం కల్పించారు ఎంఎల్వీకి.

నటి వి.ఎన్. జానకికి పాట పాడటం ద్వారా తమ సినీ జీవితానికి శ్రీకారం చుట్టినప్పుడు ఎంఎల్వీ వయస్సు ఇరవై ఏళ్ళు. అనంతరం అనేక అవకాశాలు వచ్చినప్పటికీ తనకిష్టమైన పాటలు మాత్రమే పాడుతూ వచ్చిన ఎంఎల్వీ భావానికి తగినట్లు పాడటం ద్వారా తనకో ప్రత్యేక గుర్తింపు పొందారు.

రాజా దేశింగ్ అనే సినిమాలో షణ్ముఖప్రియ, కేదారగౌళ, అఠాణా, మోహనం, బిలహరి, కానడా, కాపీ తదితర ఎనిమిది రాగాలలో "పార్కడల్ అలైమేలే..." అనే దశావతార పాటను పాడగా దానికి విశేష ఆదరణ లభించింది. తర్వాతికాలంలో పలు భరత నాట్య వేదికలపై కూడా ఈ పాట తప్పనిసరిగా వినిపించేది. అలాగే కచ్చేరీలలో ముగింపు పాటగా ఆమె ఈ పాటను పాడేవారు.

1951లో ఆమె వివాహం కృష్ణమూర్తితో జరిగింది. ఎంఎల్వీ పురోభివృద్ధిలో ఆయన పాత్ర అడుగడుగునా ఉండేది. ఓవైపు సినిమాలలో పాడుతూ వస్తున్నా శాస్త్రీయ కచ్చేరీలలో పాడటానికే ఆమె ఎక్కువ మక్కువ చూపడం విశేషం.

మధురమైన గొంతు, స్పష్టమైన ఉచ్చారణ, భావ ప్రకటనకు పెట్టింది పేరైన ఎంఎల్వీ గారు ఓమారు పాడిన పాటను మరోసారి పాడేటప్పుడు కొత్త కొత్త సంగతులతో ప్రేక్షకులను అలరించేవారు. సభలలో ఎక్కువ పాడని రాగాలను తన స్వరంలో వినిపిస్తూ సంగీతప్రియులను ఆకట్టుకునేవారు. ఆలాపనప్పుడు విస్తారమైన కల్పనా స్వరాలతో ఆ రాగాన్ని, ఇతర రాగాలకూ ఉన్న తేడాలను వీనులవిందుగా ఆలపించేవారు.

SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.

Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

తన తల్లిలాగే పురందరదాస్ కీర్తనల వ్యాప్తికి ఆవిడకూడా తన వంతు కృషి చేసారు.

తమిళ కీర్తనలకుకూడా అధిక ప్రాధాన్యం ఇస్తూ వచ్చారు.

ఆవిడ పాడిన తిరుప్పావై, తిరువెంబావై పాటలు తమిళ సంగీతాభిమానుల ఇళ్ళల్లో ఇప్పటికీ వినిపిస్తూ ఉంటాయి.

సమకాలికులైన ఎంఎస్. సుబ్బులక్ష్మి, ఎం.ఎల్. వసంతకుమారి, డి.కె. పట్టమ్మాళ్ లను సంగీత రాణులని, సంగీత ముమ్మూర్తులనీ, ముప్పెరుం దేవియర్ అనీ వ్యవహరించేవారు.

హిందుస్తానీ సంగీత విద్వాంసుడు బడే గులాం అలీ ఖాన్ వంటివారు వసంతకుమారి గాత్రాన్ని ప్రశంసించేవారు.

ప్రముఖ మృదంగ విద్వాంసుడు పాలక్కాడు మణి అయ్యర్ వంటి ప్రముఖులెందరో ఎంఎల్వీగారి కచ్చేరీలలో వాయిద్య సహకారం అందించారు.

మామూలుగా సీనియర్ సంగీత విద్వాంసులకు మాత్రమే ప్రదానం చేసే కర్నాటక సంగీత ప్రపంచంలోని అత్యున్నత బిరుదైన సంగీత కళానిధిని ఎంఎల్వీకి నలభై తొమ్మిదో ఏట లభించడం విశేషం. మైసూర్ విశ్వవిద్యాలయం ఆవిడను డాక్టరేట్ పట్టాతో గౌరవించింది. ఇక భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో ఆవిడను సత్కరించింది.

ఆవిడ సంగీత ప్రజ్ఞ గురించి శిష్యులలో ఒకరైన ప్రముఖ వయోలిన. విద్వాంసురాలైన ఎ. కన్యాకుమారి మాటలలో....

**"అక్కయ్య గారి ప్రతిభాపాటవాలు సాటి లేనివి. ఏ కచ్చేరీకైనాసరే ముందుగా ఆమె రిహార్సల్ చేసేవారుకాదు. అది రాగం తానం పల్లవి అయినా సరే రిహార్సల్ లేకుండానే వేదికపైకి వెళ్ళి పాడటం మొదలుపెట్టేవారు. ఎక్కడా తడబడేవారు కాదు..."** అని చెప్పారు.

ఆవిడ శిష్యులలో మరొక ప్రముఖ గాయని సుధా రఘునాథన్.

ఆమె మాట్లాడుతూ, తాను పన్నెండేళ్ళు ఆమె దగ్గర శిష్యరికం చేశానన్నారు. ఏ కచ్చేరీకైనా ముందుగా ఆమె రిహార్సల్ చేసే వారు కాదని, ఒక్కొక్కప్పుడు కారులో వెళ్తూ వెళ్తూ కూడా పల్లవిని సృజించడం ఎరుగుదునని అన్నారు. ఆమెకు సంగీతం మీద ఉన్న పట్టు ఆశ్చర్యమేస్తుందని చెప్పారు.

తిరుచ్చూర్ రామచంద్రన్, చారుమతి రామచంద్రన్, యోగం సంతానం, శుభా గణేశన్, జ్యోతి మోహన్, జయంతి సుబ్రమణ్యం, వనజా నారాయణన్, టి.ఎం. ప్రభావతి, మీనా మోహన్, రోస్ మురళి కృష్ణన్, భామా విశ్వేశ్వరన్ అని పలువురు ఆమె దగ్గర శిష్యరికం చేసిన వారిలో ఉన్నారు. పక్షపాతమనేది లేకుండా తనకు తెలిసింది నలుగురికీ చెప్పడం ఆమె సద్గుణం.

పలువురు వాయిద్య కళాకారులకు ఆమె అనేక అవకాశాలు ఇచ్చారు. మన్నార్గుడి ఈశ్వరన్, కారైక్కుడి కృష్ణమూర్తి, శ్రీ ముష్ణం రాజారావు, తిరువారూర్ భక్తవత్సలం, జి. హరిశంకర్ వంటి కళాకారులంటే వసంతకుమారి గారికి ఎంతో అభిమానం. వారి భవిష్యత్తు కోసం ఎంతగానో దోహదపడ్డారు. దాదాపు ఆరు వందల సంగీత కార్యక్రమాలలోను, పలు గ్రామ్ ఫోన్ రికార్డులకు పాటలు పాడిన వసంతకుమారి గారు జె. కృష్ణమూర్తి ప్రారంభించిన రుషీవ్యాలీ స్కూల్ విద్యార్థులకు సంగీతంలో శిక్షణ ఇచ్చారు.

దాదాపు యాభై ఏళ్ళపాటు సంగీతమే శ్వాసగా జీవించిన వసంతకుమారిగారు తన జీవితాన్ని సంగీతానికి అర్పించారనడం అన్ని విధాలా సముచితం. ఆమె 1990 అక్టోబర్ 31వ తేదీన తమ 63వ ఏట కాలధర్మం చెందారు. ఆమె కుమార్తె, సినీ నటి శ్రీవిద్య తల్లి దగ్గర సంగీతం నేర్చుకున్నప్పటికీ సినిమా రంగానికి వెళ్ళిపోయారు. వసంతకుమారి కుమారుడు శంకరరామన్ తల్లి స్మృత్యర్థం అనేక మంచి కార్యక్రమాలు చేశారు.

ఇలా వసంతకుమారి గారి గురించి చెప్పుకోవడానికి ఎన్నో విషయాలున్నాయి.

**- యామిజాల జగదీశ్**

# నీ లీల పాడెద దేవా...!



**ఈ** పాట విశేషాలు గురించి రెండు నిమిషాలు మీతో పంచుకుంటున్నాను...

నాదస్వరం... దక్షిణ భారతదేశంలో పరమ పవిత్రంగా భావించే వాయిద్యం. గుమ్మానికి తోరణం, చెవికి ఇంపుగా సన్నాయి లేనిదే ఏ శుభకార్యమూ పూర్తి కాదు.. మరి ఇలాంటి నాదస్వరం ఇతి వృత్తంగా సినిమా అంటే అది సంగీత భరిత చిత్రమనే కదా అర్థం.. నిజజీవిత దంపతులు సావిత్రి, జెమిని గణేశన్ జంటగా 1962 లో ఏమ్వీ రామన్ దర్శకత్వంలో వచ్చిన తమిళ సినిమా 'కొంజుం సలంగై. 'సావిత్రి వందో సినిమా ఇది. కథానాయకుడు నాదస్వర విద్వాంసుడు. ఓ సందర్భంలో నాయిక గాత్రంతో పోటీగా అతడు నాదస్వరం వాయించాలి.. నాయిక కూడా అతనికి ఏమాత్రం తగ్గకుండా, నాదస్వరానికి పోటీగా తన స్వరం అందించాలి... ఆమె ఆరం భించింది భక్తిగీతం.. భక్తికీ నాదస్వరానికీ అవినాభావ సంబంధం మరి.. గొంతులో భక్తిభావం ఏమాత్రం తగ్గకుండా, సన్నాయితో పోటీ పడుతూ అటు తమిళం లోనూ, ఇటు తెలుగులోనూ పాడగలిగే గాయని కావాలి.

అప్పటికే బాగా పేరు తెచ్చుకున్న గాయనీమణులు ఆ పాట పాడడం తమవల్ల కాదని తేల్చి చెప్పడంతో, నేపథ్య గాయనిగా అప్పుడప్పుడే కుదురుకుంటున్న ఇరవై మూడేళ్ళ జానకిని వెతుక్కుంటూ వచ్చింది అవకాశం. సినిమాకి సంగీతం అందించిన ఎస్సెం సుబ్బయ్యా నాయుడు, నాదస్వరం అందించిన కారుకురుచ్చి అరుణాచలం ఇద్దరూ వారి రంగాల్లో నిష్ణాతులు.. వీరిమధ్య అప్పుడప్పుడే గొంతు విప్పుకుంటున్న జానకి.

'మురిపించే మువ్వలు' పేరుతో తెలుగులోకి డబ్ అయిన సినిమా కోసం ఆరుద్ర రాసిన ఆ పాటని ఇవాల్టి వరకూ కూడా ఇంతకన్నా బాగా పాడడం అసాధ్యం అనిపించే రీతిలో ఆలపించి, తమిళ, తెలుగు సినీ పరిశ్రమల్లో గాయనిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది జానకి.. ఐదు నిమిషాల నిడివి ఉండే పాటలో గాయనిగా జానకి విశ్వరూపం కనిపించేది చివరి చరణంలో... ఇవాల్టికీ టీవీ చానళ్ళలో జరిగే పాటల పోటీల్లో ఎంతటి గాయకులైనా పాడడానికి అంతగా ధైర్యం చెయ్యని - ఎవరన్నా పాడుతుంటే జడ్జీలు సైతం పూర్తి అప్రమత్తతతో వినే ఆ పాటే 'నీ లీల పాడెద దేవా...! ●

**రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన**

**"అజంతా"**

**వక్కపొడి**

**రవికుమార్ అండ్ కంపెని - చెన్నై**

# ప్రబంధ కవిసార్వభౌముడు శ్రీనాధసార్వభౌముడు!

## -నవరసాలనొలికించే కావ్యకర్త - రసికజన మనోభిరామ కవిత్వానికీ ఆద్యుడూ! పాద్యుడూ శ్రీనాధుడే!!-

శ్రీనాధునొక్కనికే కవి సార్వభౌముడనే బిరుదు సార్ధకమైంది. ఆయనొక్క కవే కాదు తాను వ్రాసిన పద్యాన్ని మనోహరంగా వినిపించకలిగే గళం ఉందని కొందరికే తెలుసు. అన్యరాజసభల్లో కూడా పండితుల్ని ఓడించి గండపెండేరములు తొడిగించుకున్న ఘనుడు. కొండవీటి రాజుల కాలంలో శ్రీనాధుని ప్రతిభ మహోన్నతంగా రాణించింది. రాజవిద్యాధికారిగా కూడా వ్యవహరించారు. కవిత్వాన్ని కాసుల వ్యామోహంతో స్తోత్రప్రదంగా చెప్పాడని అంటారు గానీ– ఆ అసంబద్ధపు మాటలతో నేను ఏకీభవించను.

శ్రీనాధుడు పోతనగారి బావమరిదియని కొందరు, కాదని కొందరు అంటారు– ఆ వివాదాల జోలికి పోవడం 'ప్రముఖాంధ్ర'కు రుచ్చుముకాని విషయం. గతంలో వర్తమానంలో ప్రవర్ధమానులైన రచయితలనూ, సేవలనూ తెలియచేస్తూ తెలుగు వెలుగుదనాన్ని, తీపిదనాన్ని తెలియచేయడమే శిరోధార్య విషయంగా భావించడం ప్రముఖాంధ్ర కర్తవ్యం.

శ్రీనాధ కవి సౌర్వభౌముడు 1385 –1475 సం॥ముల కాలం వాడనీ, 14వ శతాబ్దం వాడనీ, స్వతంత్ర రచనలకే ప్రాధాన్యమిచ్చినవాడనీ చారిత్రిక సత్యం. చాటుపద్య కవితా విశారదునిగా, సహజకవిగా ఆశుకవిగా, ఆనందాన్ని ఆస్వాదింపజేసే కవిత్వాన్నే శ్రీనాధుడు అందించి, ఆయన కంటూ ఓ శకాన్ని సృజించుకున్న వాడు. ఆయన్ను కాళిదాసు అంతటి వాడని చెప్పడం అతిశయోక్తికాదు. బాల్యం నుంచే కవిత్వం చెప్పిన ప్రతిభావంతుడు. తెలుగు సాహిత్య మహాసామ్రాజ్యంలో 'సార్వభౌమునిగా చెలువొందిన వాడు శ్రీనాధుడే!

అద్భుత కావ్యాలను రచించాడు. ఆయన రచించిన కావ్యాలన్నీ ఆచంద్ర తారార్కమూ సుగంధ సౌరభాలను చిందించే సౌగంధవీచికలు. మరుత్తవాటి చరిత్ర, శాలివాహన చరిత్ర, శప్తశతి. శృంగారనైషధం, హరవిలాసం, భీమఖండం, కాశీఖండం, క్రీడాభిరామం వంటి గ్రంథాలెన్నో ఉన్నాయ్. మరుత్తరాట్ చరిత్ర, శాలివాహనసప్తశతి, పండితా రాధ్య చరిత్ర అందుబాటులో లేవంటున్నారు. శ్రీనాధుని 'కాశీఖండం' బహుప్రాచుర్యం పొందిన గ్రంథం. నలదమయంతుల దాంపత్య ఇతివృత్తంగా వ్రాసిన గ్రంథం శృంగార నైషధం. ఇది 'మహాభారతం'లోని కథను చక్కటి ప్రేమ ప్రబంధంగా తీర్చిదిద్దిన శైలి శ్రీనాధునికే చెల్లింది.

క్రీడాభిరామం ఒక చిత్రమైన ఇద్దరు ప్రాణమిత్రుల చరిత్ర. ఆనాటి సమకాల సమాజ జీవనానికి అద్దంపట్టినట్లుంటుంది. వీరు ఏక శిలానగరం దర్శిస్తారు. అక్కడ అన్ని ప్రాంతాలను పర్యటిస్తారు. అక్కడి విషయా లన్నిటినీ సమాహారంగా పూసగ్రుచ్చినట్లు వివరిస్తారు. ఆ సందర్భంలోనే వారు వేశ్యావాడకు వెడతారు. ఇదొక నాటక రూపం అయినా నవలగా విశేషాలను కళ్ళకు గట్టినట్లు దర్శింపచేస్తుంది. కాకతీయ సామ్రాజ్య స్వరూపాలనూ పాలననూ కూడా మనం తెలుసుకోగలం. అత్యద్భుతమైన దృశ్యీకరణ, ఈ క్రీడాభిరామ చాతుర్యం.

శ్రీనాధుడు కొండవీటిరాజుల ఆస్థానంలో పెద వేంకటవేమారెడ్డి ఆస్థానంలో కవిగానూ, విద్యాధికారిగానూ, కార్యనిర్వాహక కర్తృత్వం వహించాడు. పొరుగు రాజుల్తో వచ్చిన స్పర్ధను తన దౌత్యంతో సమసిపోయినట్లు చేసిన రాయబార నిపుణత్వాన్ని కూడా శ్రీనాధుడు కనబరిచాడు. తిక్కనలా కత్తిపట్టలేదు కాని కత్తిలాటి ప్రతిజ్ఞాలను హరింపచేసాడు. ఆనాటి కవులు సాహితీ సమరనిపుణులనీ, రిపులనీ వెనకటి చరిత్ర పుటలను తిరగవేసినపుడెన్నో లభిస్తాయ్.

కలంపట్టి హలం పట్టినవారూ ఉన్నారు; హలంపట్టి కలంపట్టినవారూ ఉన్నారు; కలం కత్తులు రెండిటినీ పట్టిన ధీరోధాత్తులు ఉన్నారు.

ఉద్దండ పండితుడు డిండిమ భట్టును ఓడించిన ఘనత శ్రీనాథ కవి సార్వభౌమునిదే! ఏ రాజ్యము కేగినా ఆ రాజ్యములోని కవులను తన వాక్చిత్రతో ఓడించే ధీశాలి శ్రీనాధుడు.

శృంగార నైషధంలోని శ్రీనాధుని పద్యం:

**కుతకమునన్ కురంగమద కుంకుమ చర్చవహించి నీలలో**
**హితరుచలై స్వయభువులై యాహిత సౌఖ్యవిధాయులై నయ్య**
**తఇవ పయోధరంబులకు అర్ధనిశాసమయంబునన్ సమం**
**చిత నఖకింశుకార్చనము సేసే మహీపతి భక్తి ఏర్పడన్**

నలమహారాజు, దమయంతుల మధ్య జరుగుతున్న శృంగార ఘట్టాన్ని కనుల ముందు ఆవిష్కరించి యెంత కూర్చెనో!

**ప్రసిద్ధ పౌరాణిక నాటక నటుడు, శ్రీకృష్ణపాత్రధారిగా అనేక మందిని ఆనందింపజేసి, వర్ధమాన కాలంలో ఆనందింపచేస్తున్న పద్యహృద్య గాననటుడు గుమ్మడిగోపాలకృష్ణ శ్రీనాధుణ్ణి నాటక రూపంలో తాను నటించి దర్శింపచేసాడు. శ్రీనాధ చరిత్రకు అద్దం కట్టి ప్రతిబింబింప చేసాడు.**



**కుంకుమ కేళి సల్పెడు ప్రకారమునం బురుషాయితక్రియా**
**తాండవరేఖ చూపెడు విధంబున, పామర భామలేద యా**
**రెండ ప్రభాతవేళ రచియించి నితంబ భరంబు, చన్నులున్**
**కుండలముల్, కుల్ కదలగోమయ పిండము వింటి ముంగిటన్**

ప్రాతఃకాలంలో ఇంటిముందు పిడకలకుగాను పేడ ముద్దులను చేస్తున్న ఓ పల్లెటూరి స్త్రీని ఆమె పేడముద్దలను చేస్తున్న తీరును శృంగార క్రీడలాగా గోచరమవుతున్నట్లు చేసిన శ్రీనాధప్రజ్ఞ, అందం సాక్షాత్కరమవుచోట శ్రీనాధుడు కొలువుతీరుతాడు.

**బిగువై. వట్రువలై. విరాజితములై, బింకంబులై, యుబ్బులై**
**నగసాదృశ్యములై, మనోహరములై, నాగేంద్ర కుంభంబులై**
**పొగసై, బంగరుకుండలై, నునుపులై, సూనాస్త్ర జేబంతులై**
**బిగిచేబట్టు కుచద్వయమంబులకు నాశీర్వాద మబ్బాననా!**

వర్ణన చేయదగ్గ వస్తువేదైననూ కవిత్వమునకు అసాధ్యం కాదు. సహృదయులకు గిలిగింతలుపెడుతుంది. మనసును మరో లోకంలోకి తీసుకువెళ్తుంది.

**జననాధోత్తమ దేవరాయ నృపతీ చక్రేశశ్రీవత్సలాం**
**ఘన సంకాశ మహాప్రభావ హరి రక్షాదక్షనా చోటికిన్**
**గున్నపస్త్రాత్ర సముద్భవంబున వాగ్దోషంబు శాంతంబుగా**
**గనకస్నానము చేసిగా పొగడంగ శక్యమే దేవరనో**
**జొన్నకవి జొన్నయంబలి**
**జొన్నన్నము జొన్నపిసరుజొన్నలు తప్పక**
**సన్నన్నము సున్న సుమీ పన్నుగబలినాటి సీమ ప్రజలందరకున్**

సన్నన్నము కరువై అంతయూ జొన్నన్నంగానే జొన్నలుగానే ఉన్న పరిస్థితులను వివరిస్తూ చెప్పిన పద్యం.

**జోటి భారతి అర్భటిన్ మెరయుమీ ఛోద్యంబుగా నేనుగ**
**ర్ణాటాదీశ్వరుడు ప్రౌఢదేవ నృపతిన్ నాసీర ధాటీ చమూ**
**కోటి ఘోటక దట్టికా ఖురపుటీ కుట్టాక సంఘట్టన**
**స్పోటిధూత ధరారజశ్శులికింతాంభోధిన్ ప్రశంసించెదన్**

అద్భుతమైన యిట్టి కావ్య మాలికలను మనకందించిన శ్రీనాధుడు కవి సార్వభౌముడు అత్యంత విలాసవంతమైన జీవితాన్ని గడిపారు. ఎంతో రాజభోగ జీవితం గడిపిన కవి సార్వభౌముడు శ్రీనాధుడు– చివరకు శిథిలరాజభవనంలా భోగాలను కోల్పోయాడు. సన్నని పాల్గారు బియ్యపుటన్నమును భుజించిన యా కవిరాజు జొన్న అన్నమును తినుటకూ కూడా నోచుకోలేదు. వ్యవసాయమ్జేసిన ఆ కవి సార్వభౌముడు సర్కారు శిస్తులు కట్టలేక స్వర్ణ కంకణములు కల చేతికి సంకెళ్ళు వేయించుకున్నాడు. మృష్టాన్న భాగ్యం పోయింది. ముతకబియ్యపు కూడు.

ఏంవితల్లీ! 'వాణి నారాణి' యన్న మహారాజ కవికా– యీ దుర్భర దుస్సహ జీవితం? వినువీథులనూరేగింపచేసిన విధి ఎటువంటి జీవితానికి నెలవైనదీ! ఆ రాజులు లేకనా? రోజులలో రాజుకున్నమార్పులా? తెలుగుదేశమా! భవిష్యత్తులో ఏ తెలుగు కవులకూ కవిసార్వభౌమునికి కల్గిన దుర్భర జీవితం రానీయకు!

శ్రీనాధా! నీవేమై యుంటివో – వినిన మాకింత బాధ కలిగింది.– ఆనాడు నిన్నభినందించిన వారెంత మూగబాధను పడ్డారోనయా! కానీ నీకవిత్వ సంపదను పొందుతున్న మేము నిన్ను మహదైశ్వర్య సంపన్నునిగానే భావిస్తున్నాం. తెలుగుజాతి ఉన్నంతవరకూ నీ సాహితీ సార్వభౌమత్వానికి కొరత ఉండదు. కొందలమందిన మాడెందములు స్వాంతనమవుతూనే ఉంటాయ్! శ్రీనాధ కవితా! నీవు శాశ్వతడవు! అశాశ్వతవుడవు కానేకావు! ●



# మాండొలిన్ శ్రీనివాస్

ఉప్పలపు శ్రీనివాస్ 28, ఫిబ్రవరి, 1969లో పశ్చిమ గోదావరి జిల్లాలోని పాలకొల్లులో జన్మించాడు. అయిదేళ్ల ప్రాయంలోనే తన తండ్రితో పాటు తిలకించిన ఒక సంగీత కచేరీలో పాశ్చ్యాత్య సంగీత వాద్య పరికరమయిన మాండొలిన్ వాద్యం అతన్ని బాగా ఆకర్షించింది. పుత్రుడి ఆసక్తిని గమనించి స్వయంగా క్లారినెట్ వాద్యకారుడయిన అతని తండ్రి శ్రీ సత్యనారాయణ తన కొడుకుకి తొలి సంగీత పాఠాలు చెప్పటం ప్రారంభించాడు. 1976లో సుప్రసిద్ధ తెలుగు చలన చిత్ర సంగీత దర్శకుడు శ్రీ సాలూరు రాజేశ్వరరావుగారి కుమారుడు గిటారిస్ట్ వాసురావు శ్రీనివాస్‌కి పాశ్చ్యాత్య సంగీతంలో పరిచయ పాఠాలు నేర్పించాడు. శ్రీనివాస్ తండ్రిగారి గురువైన శ్రీ రుద్రజాజు సుబ్బరాజు (వీరు ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు శ్రీ చెంబాయి వైద్యనాథ భాగవతార్ గారి శిష్యులు) శ్రీనివాస్‌లోని ప్రతిభని గుర్తించి కర్ణాటక సంగీతాన్ని నేర్పించారు. గురువుగారు సుబ్బరాజు కర్ణాటక సంగీతాన్ని గానం చేయగా ఆరేళ్ళ బాలుడు శ్రీనివాస్ తదనుగుణంగా మాండొలిన్ వాయించేవాడు. సానపట్టిన వజ్రం వలె శ్రీనివాస్ తనదంటూ ఒక బాణీ అలవరచుకుని పాశ్చ్యాత్య సంగీత పరికరమయిన మాండొలిన్ పైన అత్యద్భుతంగా కర్ణాటక సంగీతాన్ని పలికించసాగాడు. అచిరకాలం లోనే శ్రీనివాస్ కుటుంబం కర్ణాటక సంగీతానికి రాజధాని అయిన మద్రాసు నగరానికి మకాం మార్చింది.

శ్రీనివాస్ 1978 లో కర్ణాటక సంగీత కచేరీని తన మాండొలిన్ పైన తొలిసారి గుడివాడలో త్యాగరాజు ఆరాధన ఉత్సవాలలో ప్రదర్శించాడు. అనంతరం డిసెంబర్ 1981లో పదకొండు ఏళ్ల ప్రాయంలో మద్రాసులోని ఇండియన్ ఫైన్ ఆర్ట్స్ సొసైటీలో శ్రీనివాస్ తన వామనమూర్తి విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. దానితో విమర్శకుల నోళ్లు మూతబడటం, సంగీత ప్రియులు సమ్మోహితులవటం జరిగింది. కర్ణాటక సంగీతపు వినీలాకాశంలో పదకొండు ఏళ్ల ప్రాయంలో ఒక ధ్రువ తార వెలసింది. తొలుత మామూలు మాండొలిన్ వాయించిన శ్రీనివాస్ తదనంతరం ఎలక్ట్రిక్ మాండొలిన్‌తో కచేరీలు ఇవ్వటం మొదలుపెట్టి కర్ణాటక సంగీత కచేరీలలో ఎలక్ట్రిక్ మాండొలిన్‌ని ప్రవేశపెట్టిన తొలి వాద్యకారుడిగా చరిత్రలోకి ఎక్కాడు. మామూలు మాండొలిన్‌కి నాలుగు జతల తంత్రులు ఉంటే శ్రీనివాస్ తన మాండొలిన్‌కి ప్రత్యేకంగా అయిదు విడివిడి తంత్రులని ఉపయోగించి గమకాలని అలవోకగా పలికించటం మొదలుపెట్టాడు.

1982 నుంచి దాదాపు మూడు దశాబ్దాల కాలం వరకు ప్రతీ ఏడూ డిసెంబర్ నెలలో మద్రాసు మ్యూజిక్ అకాడమీలో జరిగే సంగీత కచేరీలలో 23 డిసెంబర్ తారీఖు శ్రీనివాస్ మాండొలిన్ కచేరి కోసం ప్రత్యేకంగా కేటాయింపబడటం ఎంతో అరుదైన విషయం. తన పదమూడవ ఏట శ్రీనివాస్ బెర్లిన్ జాజ్ ఫెస్టివల్‌లో అరగంట మాండొలిన్ వాయించాల్సి ఉండగా ప్రేక్షకుల కోరిక మేరకు గంటన్నర సేపు వీనులవిందుగా కచేరి చేసాడు. 1992 లో శ్రీనివాస్ ఒలింపిక్ ఆర్ట్స్ ఫెస్టివల్ బార్సెలోనాలో తన మాండొలిన్‌తో ప్రేక్షకులని మంత్రముగ్ధుల్ని చేసాడు. 1995లో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కెనడియన్ గిటారిస్ట్, సంగీత దర్శకుడు మైఖేల్ బ్రూక్‌తో కలిసి శ్రీనివాస్ "డ్రీం" అనే ఫ్యూషన్ ఆల్బం విడుదల చేసాడు.

1997లో ప్రముఖ భారతీయ సంగీత కళాకారులైన జాకీర్ హుస్సేన్, శంకర్ మహదేవన్, సెల్వ గణేష్‌లతో కలిసి ఇంగ్లీష్ గిటారిస్ట్, జాజ్ మ్యూజిక్‌లో నిష్ణాతుడు అయిన జాన్ మెక్లాగ్ లిన్ ఆధ్వర్యంలో రిమెంబెర్ శక్తి పేరున ఖండాతరాలు తిరిగి చేసిన కచేరిలలో అందరిలోకి మాండొలిన్ శ్రీనివాస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. అనతికాలంలోనే ఆస్ట్రేలియా, ఆగ్నేయ ఆసియా, నైరుతి ఆసియా, అమెరికా, కెనడాలలో విస్తృతంగా పర్యటించి శ్రీనివాస్ మాండొలిన్ శ్రీనివాస్‌గా వాసికెక్కాడు. సితార్ విద్వాంసుడు పండిట్ రవి శంకర్ తర్వాత విదేశాలలో ఎక్కువగా పర్యటించిన కళాకారుడుగా మాండొలిన్ శ్రీనివాస్ పేరు పొందాడు.

మాండొలిన్ శ్రీనివాస్ తమ్ముడు స్వయంగా మాండొలిన్ విద్వాంసుడు అయిన రాజేష్, అన్నతో కలిసి కచేరీలు ఇవ్వటం మొదలు పెట్టాడు. రాజేష్ జాజ్ మ్యూజిక్‌తో పాటు పాశ్చాత్య సంగీతంలో కూడా ప్రావీణ్యం పొంది అన్నకి తగిన తమ్ముడిగా సంగీతాభిమానుల మన్ననలు పొందాడు. అన్నదమ్ములు కలిసి సంగీత దర్శకత్వం వహించి కర్ణాటక, పాశ్చాత్య సంగీతాల మిశ్రమ సంగీత ప్రదర్శనలు అసంఖ్యాకంగా చేశారు.

కర్ణాటక సంగీతంలో మాండొలిన్ కచేరీలతో పాటు ప్రముఖ హిందుస్తానీ సంగీత విద్వాంసులతో జుగల్బందీలు, పాశ్చ్యాత్య సంగీత కళాకారులతో కలిసి ప్రపంచంలో నలుమూలలా ప్రదర్శనలు ఇచ్చిన శ్రీనివాస్ సుమారు 137కి పైగా మ్యూజిక్ ఆల్బమ్స్ చేసాడు. అటు హిందుస్తానీ సంగీత వాయులీన, తబలా కళాకారులు హరి ప్రసాద్ చౌరాసియా, జాకిర్ హుస్సేన్‌లతో, ఇటు కర్ణాటక సంగీత ఘటం వాద్యకారుడు విక్కు వినాయక్ రామ్ మరియు సెల్వగణేష్, శివమణి లతో కలిసి మాండొలిన్ శ్రీనివాస్ కచేరీలు చేసాడు. ప్రముఖ చలనచిత్ర సంగీత దర్శకుడు ఇళయరాజా కర్ణాటక సంగీతం లో స్వరపరచిన బాణీలని తన మాండొలిన్ మీద వాయించి వాటిని ఇళయరాజా క్లాసిక్స్ పేరిట సీడీ విడుదల చేసాడు శ్రీనివాస్.

తన పదునెనిమిదవ ఏటనే మ్యూజిక్ స్కూల్‌ని ప్రారంభించి ఎందరో దేశ విదేశాల నుంచి శిష్యబృందాన్ని తయారు చేసాడు శ్రీనివాస్. వీరిలో చాలామందికి ఉచితంగా మాండొలిన్ సంగీతాన్ని బోధించాడు. కంచి పరమాచార్య వారికి, పుట్టపర్తి సాయిబాబాకి మాండొలిన్ శ్రీనివాస్ పరమ భక్తుడు.

శ్రీనివాస్ లెక్కలేనన్ని పురస్కారాలు సన్మానాలు పొందాడు. వాటిలో మచ్చుకి కొన్ని – 1998లో భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ 2010 లో సంగీత నాటక అకాడెమీ పురస్కారం, 1984 లో పదిహేనవ ఏట తమిళనాడు ప్రభుత్వం వారి ఆస్థాన విద్వాన్ కంచి కామకోటి పీఠం, శృంగేరీ శారదా పీఠం, శ్రీకాళహస్తి దేవాలయం, మంత్రాయలం రాఘవేంద్ర స్వామి మఠం వారి ఆస్థాన విద్వాన్, ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు శ్రీమతి సుబ్బులక్ష్మి గారి చేతుల మీదుగా సంగీత బాల భాస్కర బిరుదు, 1991లో భారత రాష్ట్రపతి నుంచి జాతీయ పౌరుడి పురస్కారం, మద్రాసు మ్యూజిక్ అకాడమీ నుంచి ఉత్తమ కళాకారుడి పురస్కారం, 2004లో మధ్య ప్రదేశ్ ప్రభుత్వం వారిచే సత్కారం.

శ్రీనివాస్ నిరంతర సంగీత సాధకుడు, కళాపిపాసి. అతని మాటల్లోనే, "సంగీతానికి అంతు ఏది? నేర్చుకున్నకొలది ఇంకా మరెంతో నేర్చుకోవాల్సింది వుంది." శ్రీనివాస్ పరమ సాత్వికుడు, మృదు స్వభావి, సౌమ్యుడు. భేషజాలు లేకుండా సామాన్యంగా వుంటూ వినమ్రతతో, ఎదిగినకొద్దీ ఒదిగివుండే వ్యక్తిత్వం కలవాడు. సృజనాత్మకతతో వినూత్న ప్రయోగాలు చేసినా కర్ణాటక సంప్రదాయ మూలాల్ని విడనాడకుండా తనకంటూ ఒక విలక్షణమైన ఒరవడిని ఏర్పరచుకున్నాడు.

శతాబ్దానికి ఒక్కసారి జన్మించే గొప్ప కళాకారులు, బాల మేధావుల కోవకి చెందినవాడు మాండొలిన్ శ్రీనివాస్. 19 సెప్టెంబర్, 2014 లో తన 45 ఏట మాండొలిన్ శ్రీనివాస్ తనువు చాలించాడు. కానీ అతను విడిచిపెట్టి వెళ్లిన అపార సంగీత సంపద ఆచంద్ర తారార్కం నిలిచి ఉంటుంది. అతని పెదవులపైన నడయాడే చిరునవ్వు ఎన్నటికీ చెరగని ముద్రగా సంగీత అభిమానుల హృదయాలలో నిలిచిపోతుంది. శ్రీనివాస్ మన తెలుగువాడు కావడం మనకి గర్వకారణం.

**– డాక్టర్. బీ.యన్.వీ. పార్థసారథి**



# కృపానంద వారియార్

**కృ**పానంద వారియార్... మల్లయదాసర్, కనకవల్లి దంపతులకు 1906లో తమిళనాడులోని వేలూరు పరిధిలోని గాంగేయనల్లూరులో నాలుగవ సంతానంగా జన్మించారు. ఈయన కుమారస్వామి భక్తుడు.ఆయనకు తండ్రే గురువు. ఎనిమిదో ఏట కవిత్వం చెప్పి అందరినీ ఆశ్చర్యపరచిన కృపానంద వారియార్ పన్నెండో ఏట పదహారు వేల శ్లోకాలు కంఠస్థం చేసి తడబడకుండా చెప్పారు. పద్దెనిమిదో ఏట ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ఈయనను వారియార్ స్వామిగళ్, అరవై నాలుగో నాయన్మార్ అని కూడా పిలిచేవారు.

శివకవి అనే సినిమాకు సాహిత్య రచన చేసిన వారియార్ ఎవరికి ఏం చెప్పాలి, ఎలా చెప్తే బోధపడుతుంది అనేది అప్పటికప్పుడు అంచనా వేసి చెప్పడంలో సిద్ధహస్తులు. కథాకాలక్షేపాలలో ఆయన చెప్పే పిట్టకథలు అందరినీ ఆకట్టుకునేవి. అవి హాస్యపూరితమైనవి. అదే సమయంలో మంచిని ప్రబోధించేవిగానూ ఉండేవి. ఆదంతా ఆ దైవకృపే అనుకునేవారు. ఆయన గొంతే ఓ ప్రత్యేకం. రాయడంలోనూ తనదైన శైలిని పాటించారు. తిరుపుగళ్ అముదం (అమృతం) అనే పత్రిక కూడా నడిపారు. అయిదు వందలకుపైగా ఆధ్యాత్మిక వ్యాసాలు రాశారు.

తాత చెప్పిన చిన్న కథలు, పాంబన్ స్వామిగళ్ జీవిత చరిత్ర తదితర పుస్తకాలు రాశారు.

శైవ సిద్ధాంతం, భక్తి మార్గం, దైవకృప వంటి వాటి గురించి గంటల కొద్దీ ప్రసంగించడంలో ఆయనకాయనే సాటి. మైలాపూర్ ఫైన్ ఆర్ట్స్ వేదికపైన ఆయన ప్రవచనాలు వినే భాగ్యం కలిగింది నాకు. సంగీతంమీదా పట్టుండటంతో తేవారం, తిరుమంత్రం, తిరుప్పుగళ్ వంటివాటిని భక్తితో రాగయుక్తంగా పలికేవారు. వాటికి అర్థాలు చెప్పే తీరు ఇట్టే ఆకట్టుకునేది. ఆయన నవ్వకుండా మనల్ని నవ్వించేలా చేసేవారు తమ ప్రసంగాలతో!

సమయస్ఫూర్తికి పెట్టింది పేరు. ఓమారు ఆయన ఉపన్యసిస్తుంటే కొందరు లేచి వెళ్ళిపోతుండటం గమనించి తాను చెప్తున్న విషయాన్ని ఓ క్షణం ఆపి మళ్ళీ కొనసాగించారు.

"నాకెందుకు మాటల దాత అనే బిరుదు ఎందుకిచ్చారో తెలుసా? ఆ బిరుదు నాకు ప్రదానం చేస్తున్నప్పుడు తెలీలేదు. కానీ ఇప్పుడు స్పష్టంగా అర్థమైంది" అన్నారు.

లేచి వెళ్ళిపోతున్న వాళ్ళు ఆ మాటతో మళ్ళీ ఎక్కడివారక్కడ కూర్చుండి పోయారు, ఆయన ఏం చెప్తారా అనే ఆరాటంతో!

ఆయన తన ఉపన్యాసం కొనసాగించారు "నేను మాట్లాడుతున్నాను. వాళ్ళేమో వెళ్ళిపోతున్నారే.... నా పని చెప్పడం. వాళ్ళ పని వెళ్ళడం....అందుకే నాకా బిరుదు ఇచ్చారు" అన్నారు.

1993లో ఇంగ్లండ్ వెళ్ళి తమిళనాడుకి తిరిగొస్తుండగా విమానంలోనే తుదిశ్వాస విడిచారు.

వేలూరు జిల్లా కాట్పాడిలో ఆయనను కీర్తించేలా ఓ ఆలయం నిర్మించారు.

ఆయన ఉపన్యాసాలు ఎనభైకిపైగా సిడీలలో అందుబాటులో ఉన్నాయి. అవి వింటే మనసుకు హాయి. ప్రశాంతత. ఆయన చెప్పిన ఆణిముత్యాలలో కొన్ని....

- **ప్రేమను పంచండి! కృతజ్ఞత అనే చందనాన్ని చల్లండి! దయ అనే దీపాన్ని వెలిగించండి! ప్రపంచం నిన్ను మానవరూపంలో ఉన్న భగవంతుడు అని కీర్తిస్తుంది!!**
- **మీకు కోపం వచ్చినప్పుడు మీ ముఖాన్ని అద్దంలో చూసుకోండి. సిగ్గుతో తలదించుకుంటారు. వెంటనే కోపం ఎగిరిపోతుంది.**
- **దాతృత్వ మార్గాన్నెప్పుడూ వీడకూడదు.**
- **అబద్ధాలు, కుతంత్రాలు, మోసాలతో సంపాదించే డబ్బు వచ్చినట్టే వచ్చి లేకుండా పోతుంది.**
- **జీవితంలో ఉన్నత శిఖరాలనేవి ఆలోచనలపై ఆధారపడి ఉంటాయి. మంచి విషయాలు మాత్రమే ఆలోచించండి. మంచి విషయాలు మాత్రమే మాట్లాడండి.**
- **వృద్ధులు మాత్రమే పెద్దవారు కాదు. ఇతరులను నిందించకుండా, ఉదారత ఉన్నవారు కూడా మహానుభావులవుతారు. గొప్పవారవుతారు.**
- **వ్యాపారంలో లాభనష్టాలు లెక్కించే వ్యాపారిలా, మదిలో మెదిలే వ్యాపారిలా, పరిశోధించి, భయపెట్టే మంచి - చెడు ఆలోచనలను బేరీజు వేసుకోవాలి. మనల్ని మనం సమీక్షించుకోవాలి.**
- **మనిషికి క్రమశిక్షణ ముఖ్యం. ప్రగతికి సోపానమవుతుంది.**
- **భార్యను తప్ప ఇతర మహిళలను తల్లులుగా భావించండి.**
- **సమాజంలో శాంతి నెలకొంటే ఆనందమూ ఉంటుంది.**
- **జీవించడానికి దేవుడు అన్నీ సమకూర్చాడు. కోరికలు, పనితనం నియంత్రించుకునే దృక్పథం ఉంటే ప్రతి ఒక్కరూ సంవృద్ధిగా జీవించగలరు. దేవుడితో బేరసారాలు చేయకూడదు. ఇవ్వడమొకటే మన బాధ్యత.**

**- యామిజాల జగదీశ్**



## జ్ఞాన విజ్ఞాన ఖని విజ్ఞాన భాస్కరుడు

# సర్వేపల్లి రాధాకృష్ణ

బక్కపలచని విగ్రహం, స్వచ్ఛ ధవళమైన శిరోవేష్టనం, మోకాళ్ల వరకు దిగినటువంటి సిల్కుకోటు. తెలుగుదనం ఉట్టిపడే పంచకట్టు. దీర్ఘమైన నాసిక, సులోచనాల గుండా ప్రకాశించే తీక్షణమైన చూపు, జాలపాతం వలె నినదించే వాగ్ధార ఖంగు ఖంగుమని ధ్వనించింది. ఏ భారతీయుడు మరువలేని భారతీయతకు నిదర్శనంగా నిలిచారు. అటువంటి మహాపురుషుల పంక్తిలో ఒక విలక్షణమైన తేజస్సుతో, ప్రతిభతో భాసించిన మహామనిషి, సర్వేపల్లి రాధాకృష్ణ పండితుడు.

1888 మద్రాసు సమీపంగా ఉన్న తిరుత్తణిలో ఒక బీద బ్రాహ్మణ కుటుంబంలో జననం. వారసత్వంగా విద్యకాని, సంపదకాని ఆయనకు లభించలేదు. ఆ విషయం ఆయనే చెప్పారు. తిరుపతిలోనూ, నెల్లూరులోను, వెల్లూరులోను, మద్రాసులోనూ క్రైస్తవ మిషనరీ సంస్థలలో ఆయన విద్యాభ్యాసం జరిగింది. 1909లో మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో నెలకు నూరు రూపాయల జీవితం మీద నియమింపబడిన కొద్దికాలంలోనే తత్త్వశాస్త్ర విభాగానికి ప్రధానాచార్యుడయ్యారు. మైసూరు విశ్వవిద్యాలయంలో మూడేళ్ళు పనిచేసిన పిదప, అశుతోష్ ముఖర్జీ ఆయన అమోఘ ప్రతిభను గురించి కలకత్తా విశ్వవిద్యాలయంంలో 1912లో మనస్తత్వ నైతిక శాస్త్ర విభాగానికి ప్రధానాచార్య పదవినిచ్చారు. రవీంద్రుని కవితావైభవం మీద ఆయన రచించిన గ్రంథం ప్రప్రథమంగా ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 1927లో ప్రచురితమైన 'ఇండియన్ ఫిలాసఫీ' ఆయన కీర్తికి అద్దంపట్టింది. ఖండాంతర వ్యాప్తిని కలిగించింది. ఆక్స్‌ఫర్డ్ ఆప్టన్ ఉపన్యాసాలు, షికాగో నగరంలో హస్కెల్ ప్రసంగాలు, గౌతమబుద్ధునిపై ప్రసంగం ఆయన వాగ్విభూతికి పట్టం కట్టాయి.

డాక్టర్ సి.ఆర్. రెడ్డి పదవీ విరమణ అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులయ్యారు. అప్పట్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక వుండేది. డాక్టర్ రాధాకృష్ణన్ అంతకు పూర్వమే మద్రాసు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా పనిచేసిన బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడిగారిపై ఎన్నికల్లో గెలిచి 1931 మేలో ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవి చేపట్టారు.

ఆ విశ్వవిద్యాలయాన్ని జాతీయస్థాయి విశ్వవిద్యాలయంగా, అంతర్జాతీయ ప్రసిద్ధిగాంచిన విశ్వవిద్యాలయాల స్థాయిలో రూపుదిద్దడంలో ఆయన ఎంతో అంకిత భావంతో, అవిశ్రాంతంగా కృషి నెరిపారు. వివిధ విద్యాశాఖలలో దేశ, విదేశాలలో లబ్ద ప్రతిష్టులు, ప్రతిభా సంపన్నులు అయిన వారిని ఆచార్యులుగా నియమించారు. అలా ఆయన ద్వారా నియమితులయినవారు భవిష్యత్తులో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మేధావులుగా వాసికెక్కారు. ఇది ఆయన విశాల దృక్పథానికి తార్కాణం. అయితే గాంధీజీ, మదన్‌మోహన్ మాలవ్యాల ఆకాంక్షతో బెనారస్ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవి అలంకరించిన కాలంలో ఉన్నత విద్యపై ఆయన సమర్పించిన నివేదిక ఈనాటికీ శిరోధార్యమే. 'యునెస్కో' సంస్థ కార్యకలాపాలను తీర్చిదిద్దిన ఘనత రాధాకృష్ణన్‌కే లభిస్తుంది.

వివిధ దేశాలలో విద్వత్ సదస్సులలోనూ, పండిత పరిషత్తులలోనూ, విశ్వ విద్యాలయ ప్రాంగణాలలోనూ ఉపన్యసిస్తూ, తాత్వికాచార్యుడుగా, ఒక మహావక్తగా, బహుగ్రంథ కర్తగా ఆరు దశాబ్దాల జీవితం గడిపారు. యావత్ ప్రపంచంలో, ఏ విఖ్యాత శాస్త్రజ్ఞునికి, ఏ మహామేధావికి ఏ తాత్విక చింతాగ్రేసరునికి దక్కని అత్యంత అరుదైన గౌరవం డా. రాధాకృష్ణన్‌కు లభించింది.

రాధాకృష్ణ ప్రతిభా సంపన్నతా ఔన్నత్యంతో తాను తెలుగువాడననే స్ఫూర్తిని కల్గించకపోవడమొకటె బాధాకరం.

ఆయనను ప్రపంచ దేశాల్లో ప్రఖ్యాతి గాంచిన 152 విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించడం ఆయన ప్రజ్ఞ ధురీణతకు, ప్రతిభా విశేషాలకు, గణతకు,



జగత్ విఖ్యాతికి జాజ్వాల్యమాన ప్రతీకలు.

ఆయన చివర వరకు రాధాకృష్ణన్ జ్ఞానయోగిగానే మనుగడ సాగించారు. అందలాల కోసం అర్రులు చాచలేదు. అయినప్పటికీ స్వాతంత్ర్య సముపార్జనానంతరం ఉన్నత పదవులు ఆయనను వెదుక్కుంటూ వచ్చాయి. భారత రాజ్యాంగ సభ సభ్యునిగా, 1949లో రష్యాలో భారత రాయబారిగా నియమింపబడి, ఒక సాధారణ జ్ఞాన దూతగా ఆయనే రష్యా వెళ్ళారు. ఆయనను 1952లో భారతదేశ ఉపాధ్యక్ష పదవి, అనంతరం అధ్యక్షపదవినీ అలంకరించారు.

అధ్యక్షపదవి నిర్వహణ అవసరమైనప్పుడు ప్రభుత్వ విధానాలను నిశితంగా, తీవ్రంగా విమర్శించటానికి వెనుకాడలేదు. పేరుకుపోతున్న అవినీతిని, అసమర్థతనూ, లంచగొండితనాన్ని, జాతీయ వనరుల దుర్వినియోగాన్ని అభిశంసించడం జరిగింది. ఒక దశలో నెహ్రూకే హెచ్చరిక చేసారు. అధ్యక్షపదవి హుందాతనం నిలబెట్టారు. అధ్యక్షపదవి పొడిగింపునకు ఆరాటపడలేదు. 1967లో పదవి విరమణ చేసి ఆయన మద్రాసులో శేష జీవితాన్ని గడిపారు.

1975 ఏప్రిల్ 17న నిశాగగనంలో నక్షత్రరాశి అస్తమించినట్లు ప్రశాంతంగా కన్నుమూశారు. అయితే రవీంద్రుని గీతాంజలిపై ఆయనే చేసిన వ్యాఖ్యాన గ్రంథం రవీంద్రునికి నోబుల్ బహుమతి నందుకొనేట్టు చేసింది. ●



# వేదమాత! ఆయుర్వేదమాత ఒకరే!

## వ్యాసుడులేనిచో వేదముల్లేవు - చరకుడు లేకపోతే ఆయుర్వేదమే లేదు

విశ్వానికి ప్రకృతే వైద్యాలయమనీ, ప్రకృతిపై మొలచిన భూమిలో వేళ్లూనుకుని వున్న వనసంపత్తిలోనే ఔషధాలున్నాయని భారతదేశమే తేల్చిచెప్పినది!

ఏ దేశానికీ లేని గొప్పదనం భారతదేశానికున్నది. వేదాల్ను ఎవరో వ్రాయలేదు. వ్యాసఋషిప్రోక్తం. వేదముల్లోని అంతర్వేదమే ఆయుర్వేదం.

మనిషి నూరేండ్లు గాకుండా నూటయిరవై ఏండ్లు బ్రతకాలన్నది శాస్త్రం. చాలామంది తెలుగు యోగులే రెండుమూడు వందలయేండ్లు జీవించారు. ఈ విషయాన్ని కుర్తాళం పీఠాధిపతి శ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీ స్వామివారు కూడా తమ ఉపన్యాసముల్లో సిద్ధీకరించినట్లు చెప్పారు. ఇప్పటికీ హిమాలయ పర్వతాల్లో దృశ్యాదృశ్యంగా వారున్నారు. త్రేతాయుగం నాటి ఆంజనేయులు వారు హిమవత్పర్వతాల్లో తిరుగుతున్నారు. నిజానికి ఆయన వైద్యులు కన్నా గొప్ప వైద్యుడు. పర్వతంతో సహా సంజీవనీ మూలికామొలకను తెచ్చి, లక్ష్మణుని ప్రాణాలను కాపాడారు. రామరావణ యుద్ధంలో విగత జీవులైన వానరుల్ని ఈ మూలికలు, ఆకుపసర్లే బ్రతికించాయ్. నా చిన్నపుడు చెవిపోటువస్తే రుద్ర జడాకు రసం పిండిపోసేవారు! అరటి, పనస, బాదం, తమలపాకుల్ని నూనె కానీ, ఆముదం కానీ రాసి, నిప్పుసెగ చూపించి, నొప్పివున్న శరీరభాగానికి కట్టేవారు. పసరు వైద్యంచేసేవారు. వాత, పిత్త, కఫములను నివారింపచేసేవారు.

కొన్ని సంవత్సరాల క్రితం, నేను చింతలూరు వెళ్లినపుడు– శ్రీవెంకటేశ్వరా ఆయుర్వేద నిలయం, వారిఆలయంలో ఎన్నో ఆకుల్ని నిక్షిప్తంచేయడం చూశాను. ఈ విషయంలో ద్విభాష్యం శ్రీరామమూర్తి (మేనేజింగ్ డైరెక్టరు) నాకు సహకరించారు. వారి తాతతండ్రులీ వైద్య ప్రదాతలు, కేసరిగారు మద్రాసులో స్త్రీల గర్భాశయ వ్యాధులకు 'లోధ్ర' అనే ఓ కషాయాన్ని సీసాల్లో విక్రయించేవారు.

మా తాతగారు గోటేటి విస్సంరాజుగారు బంగారాన్ని పుటం వేసి స్వర్ణ కాంతవల్లభ రసం, వసంతకుసుమాకరం వాడేవారు. ఆయన స్వయంగా తయారుచేసిన అగ్నితుండితో సర్వజ్వరాలను నివారింపచేసేవారు. ఆయుర్వేదంలో నివారణ కాని వ్యాధులంటూ లేవు. ముఖ్యంగా ఆయుర్వేదానికి భూమిపైనా, భూమిలోనున్న తీగలూ, వేరులే ప్రధాన ఔషధ మూలికలు. పొట్టి శ్రీరాములు గారు చివరివరకూ ఆయుర్వేద ఔషధాలనే తీసుకునేవారు. ఆ రోజుల్లో డా॥ కస్తూరి



నారాయణమూర్తిగారూ, ఆచంట రుక్మిణీపతి వంటి ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యులుండేవారు. రక్తపరీక్షలకుగానీ, రక్తపోటుకుగానీ, క్షయనుగానీ పరీక్షించి చెప్పడానికి చికిత్సా పరికరాలు లేవు. చేతినాడిని జూచే రోగనిర్ధారణ చేసేవారు. ఈ నాటికినీ ఇంగ్లీషు వైద్యంలో, హోమియో వైద్యంలో నాడిని, నాడి వేగాన్ని (పల్స్‌రేటు) చూడకుండా ఉండే వైద్యులు లేరు. స్టెతస్కోపు పెట్టుకోకుండా గుండెను పరిశీలించలేరు.

ఇదేదో కొత్త విధానం చెడ్డదనీ, పాతవిధానం శ్రేష్ఠమైనదనీ చెప్పడానికీ వ్యాసాన్ని ఉద్దేశించలేదు. కానీ, వేదం ప్రాతిపదికగానే వైద్యాలు పుట్టాయ్. శస్త్ర చికిత్సలకు కూడా ఆనాటి శస్త్రచికిత్స ప్రాతిపదికనే వచ్చాయ్. ఈ రోజు యిచ్చే మత్తు మందులకు బదులు ఆ రోజుల్లో ద్రాక్షరసం త్రాగించేవారు.

మూలాల్ని మరవడం మన నైజం. మన మూలికలతోనే ఇంగ్లీషు మందులు తయారవుతున్నాయ్. మనవాడు డా॥ సుబ్బారావు పెన్సిలిన్ కనిపెట్టాడు. మన వాడు నోరి దత్తాత్రేయులు, ఇమంది వెంకట్రావులు అమెరికాలో కాన్సర్ స్పెషలిస్టులు, మన పోలవరపు తులసీదేవి, గెడ్డం దశరథరామిరెడ్డి, గంటి సుబ్రహ్మణ్యం గారలు అక్కడ ప్రముఖ వైద్యులు (కొందరి పేర్లు నాకు తెలియకుండా ఉండవచ్చు)

ఇంగ్లాండులోని డాక్టర్లందరూ మనవాళ్ళే, దుబాయ్, సింగపూర్, కౌలాలంపూర్‌ల్లో మన డాక్టర్లే మేటి డాక్టర్లు. ప్రపంచదేశాల్లో వెదికి వెదికి పట్టుకుంటే దేశానికి పదిమందైనా మన డాక్టర్లుంటారు. ఈ డాక్టర్ల ఆధునిక వైద్యానికి ప్రాతిపదిక ఆయుర్వేదం, ఆయుర్వేదం చతుర్వేదాల్లోని అంతర్వేదం. ●

Beautiful City - Beautiful Hotel




Foreverar your Serivice in the Heart of Visakhaparnam

HOTEL Daspalla

Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

HOTEL MAYURA

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**

# కథకుడూ, చిత్రకారుడూ, చలనచిత్ర కళా దర్శకుడు మాధవపెద్ది గోఖలే!



చలనచిత్రసీమ గర్వించదగిన కళా దర్శకుడు మాధవపెద్ది గోఖలే! చిత్రసీమ స్వర్ణ యుగంలో టి.వి.యస్. శర్మ, నాగ్ (కె. నాగేశ్వర రావు) లది ఓ ప్రత్యేకబాణీ!

కథా రచయితగా, కళా దర్శకునిగా, చిత్రకారునిగా మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలే దొక ప్రత్యేక స్థానం. ఆయనతో పరిచయం కలుగడం అదృష్టంగా భావించాను. గళాధారిగా, నటునిగా మాధవపెద్ది సత్యం, కళాదర్శకునిగా మాధవపెద్ది గోఖలే సుప్రసిద్ధులు.

అడవిబాపిరాజు తర్వాత చిత్రకళాకారుడిగా, సాహితీ రంగంలో సృజనాత్మక రచయితగా రెండు కళల్లోనూ పేరుపొందినవాడు మా గోఖలే. కష్టజీవుల భాషలో వారి జీవితాల ఇతివృత్తాలలో కథా సాహిత్యాన్ని సృష్టించి మా గోఖలే అరుదైన కథలు రచించాడు.

ఆంధ్రపత్రిక, ప్రజాశక్తి, ఆంధ్రజ్యోతి, చందమామ వంటి పత్రికల్లో చిత్రకారుడిగా ఉద్యోగం చేసిన గోఖలే యాభై చలనచిత్రాలకు కళా దర్శకత్వం వహించారు. ఆయన సృష్టించిన అనేక చిత్రాల్లో అన్నీ ఆయనకు గొప్ప పేరు తెచ్చినవే. అయితే వాటర్‌కలర్స్‌లో చిత్రీకరించిన బ్రహ్మనాయుడు చిత్రం గోఖలే చిత్రించిన గొప్పచిత్రాల్లో ఒకటిగా మన్ననలు పొందింది. అలాగే ఆయన చిత్రించిన పావురాల జంట చిత్రం ప్రశంసలందుకుంది. కృష్ణాజిల్లా కాటూరు, ఎలమర్రు గ్రామాల్లో పోలీసులు గ్రామ ప్రజలను దిగంబరులుగా మార్చి గాంధీ విగ్రహానికి ప్రదక్షిణ చేయించారు. ఆ సంఘటన ఆధారంగా గోఖలే చిత్రించిన చిత్రం అప్పట్లో ఎంతో సంచలనం సృష్టించింది.

మాధవపెద్ది గోపాలకృష్ణ గోఖలే ఆయన పూర్తిపేరైనా ఆయన మా గోఖలేగా ప్రసిద్ధులు.

1917 మార్చి 7న గుంటూరు జిల్లాలోని బ్రాహ్మణకోడూరులో ఆయన జన్మించారు. తండ్రి లక్ష్మీనరసయ్య పలుమార్లు జైలు శిక్ష అనుభవించిన స్వాతంత్ర్య సమరయోధులు. గోఖలే ఏడేళ్ల వయస్సు వరకు బ్రాహ్మణకోడూరులోనే చదువుకున్నారు. ఆ తర్వాత చిత్రలేఖనం నేర్చుకోవడానికి ఆయన బందరు వెళ్ళారు. ప్రఖ్యాత చిత్రకారులు గుర్రం మల్లయ్య వద్ద చిత్రలేఖనం నేర్చుకున్నారు. తర్వాత మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో కళావిద్యాభ్యాసం చేసి డిప్లొమా పొందారు. ప్రసిద్ధ చిత్రకళాకారులు దేవీప్రసాద్ రాయ్ చౌదరి, దేవీప్రసాద్ నారాయణరావు వంటి వారి వద్ద గోఖలే చిత్రకళ అభ్యసించారు.

గోఖలే కథలకు ఎంతో ప్రత్యేకత ఉంది. ఆయనకు జానపదుల భాష, ఆ నుడికారం తెలియకపోయినా వాటిని ఆకళింపు చేసుకోవడమే కాక అందులో పాండిత్యం సాధించారు. వారి కథల్లో జానపదులు, గిరిజనుల మాటలే కాదు. వారి పరిసరాలు, కష్టసుఖాలు, ఆశలు, ఆకాంక్షలు, సరదాలు అన్నీ కనిపిస్తాయి. గిరిజనులపై జమీందారులు బడా రైతులు సాగించిన అక్రమాలు, అన్యాయాలు వాటన్నిటిని విపులంగా రచనలు చేయగలిగారు.

గోఖలే కథల సంపుటాలు 'మూగజీవాలు', 'బల్ల కట్టు పాపయ్య' చాలా ఏళ్లక్రితమే అచ్చయ్యాయి. వాటన్నిటినీ కలిపి 'మా గోఖలే కథలు' పేరుతో విశాలాంధ్ర సంస్థ 1989లో ప్రచురించింది.

గ్రామాల్లోని పెత్తందార్లు, వారి దౌర్జన్యాలు, పేదసాదల పాట్లు, మారిన పల్లెల వాతావరణం, ఒడిదుడుకుల వల్ల దిగజారిన పరిస్థితులు, వెట్టి చాకిరీ తెచ్చే యాతనలు గోఖలే కథా వస్తువులు. కట్నాల కర్కశత్వం, ఆడపిల్లల తండ్రుల బాధలు, ధనిక స్త్రీల దర్పాలు, సినిమా జూదంలో సర్వం కోల్పోయిన వాళ్లు ఈ కథల్లో ఎన్నో రూపాల్లో కనిపిస్తారు.

చిత్రకళాకారుడిగా మాధవపెద్ది గోఖలే విజయావారి చిత్రాలు విజయవంతం కావడానికి కృషి చేశారు. చిత్రంలో ప్రతి ఫ్రేములోనూ ఆయన శ్రమ, కృషి కనిపిస్తుంది. సెట్స్ రూపొందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. నటీనటుల దుస్తులు మొదలుకొని ప్రతిదీ ఆయనే ఎంపిక చేసేవారు. పాత్ర స్వభావాన్ని అనుసరించి అన్నీ సహజంగా అమరేలా ఎంపిక చేసుకునేవారు. చారిత్రక జానపద చిత్ర రూపకల్పనలో ఆయన 'మీనియేచర్ బొమ్మ'లు గీసి సంతృప్తిచెందాకే వాటిని రూపొందించేవారు. సంవత్సరానికి ఒకటి లేదా రెండు చిత్రాలకన్నా ఎక్కువగా పనిచేసేవారు కాదు. ఎక్కువ సినిమాలైతే ఆర్ట్ డైరెక్టర్‌గా తను తగిన న్యాయం చేకూర్చలేనేమో అనుకునేవారు. పౌరాణిక, జానపద చిత్రాల కోసం ఆయన స్వయంగా స్కెచ్‌లు, వాటర్ కలర్, ఆయిల్ కలర్ చిత్రాలు గీసారు. వారింట్లో ఆయన వేసిన 'బ్రహ్మన్న' పెయింటింగ్ ఉండేది. ఎందరో చిత్రకారులు ఆయనింటికి వెళ్ళినవారంతా దాన్నుంచి ఎంతో స్ఫూర్తి పొందేవారు. ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసే సెట్స్ వెనకాల దాగి ఉండి ప్రతి ఫ్రేముకు జీవాన్ని పోసిన మా గోఖలే గూడవల్లి రామబ్రహ్మం చిత్రం 'రైతుబిడ్డ' చిత్రం ద్వారా చిత్ర రంగ ప్రవేశం చేశారు. షావుకారు, పాతాళభైరవి, మాయాబజార్, గుండమ్మ కథ, జగదేకవీరుని కథ, శ్రీకృష్ణార్జునయుద్ధం వంటి చిత్రాల నుంచి 'శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర' దాకా అనేక చిత్రాలకు కళా దర్శకత్వం వహించారు. రంగులతో రసరమ్యచిత్రాలు ఆవిష్కరించిన ఈ చిత్ర మాంత్రికుడు గోఖలే 1981లో మరణించారు. ●




# నవగ్రహాలు

నవగ్రహాలు చాలా శక్తివంతమైనవి. వాటిని పద్ధతి ప్రకారం నవగ్రహాలకు ప్రదక్షిణలు చేస్తే విశేషమైన ఫలితం ఉంటుంది. అయితే ఎలా చేయాలి? ఎన్నిసార్లు చేయాలి? అనే విషయం తెలుసుకుందాం. నిజానికి నవగ్రహాలకు ఎప్పుడు, ఎలా ప్రదక్షిణలు చేయాలో చాలామందికి తెలియదు. ఎన్ని ప్రదక్షిణలు చేయాలో తెలియదు. నవ గ్రహాలకు ప్రదక్షిణ చేసేటప్పుడు ఏ నియమాలు పాటించాలో తెలియదు. అయితే నవగ్రహ ప్రదక్షిణలకు ఒక పద్ధతి ఉంది. పద్ధతి ప్రకారం ప్రదక్షిణలు చేస్తే మంచి ఫలితాలుంటాయి. మానవ జీవం, మానసిక పరిస్థితి ప్రధానంగా వారి వారి గ్రహాల స్థితిపై ఆధారపడి వుంటుందని జ్యోతిష్యశాస్త్రం చెబుతోంది.

గ్రహస్థితిలో మార్పులు వల్లనే ఎవరి జీవితంలో అయినా ఒడిదుడుకులు ఎదురవ్వడం గానీ, లాభాలు, సంతోషాలు కలిసిరావడం గానీ వస్తుంటాయి. నవగ్రహ ప్రదక్షిణ మనిషి కష్టనష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకుంటుంది. నవగ్రహ ప్రదక్షిణలకు ఒక నిర్దిష్టమైన పద్ధతి వుంది. ఆ పద్ధతి ప్రకారం ప్రదక్షిణలు చేస్తే విశేషమైన ఫలితం ఉంటుంది. ఎప్పుడుపడితే అప్పుడు నవగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేయకూడదు. శుచిగా స్నానం చేసి పరిశుభ్రమైన దుస్తులు ధరించినప్పుడు మాత్రమే నవగ్రహ ప్రదక్షిణలు చేయాలి. కొంతమంది ప్రదక్షిణలు చేస్తున్నప్పుడు నవగ్రహాలను తాకుతూ ప్రదక్షిణ చేస్తుంటారు. సాధ్యమైనంత వరకూ ఇలా తాకకుండానే ప్రదక్షిణలు చేయాలి.

నవగ్రహ ప్రదక్షిణ చేయడానికి మంటపంలోకి వెళ్ళే ముందు, సూర్యుడిని చూస్తూ లోపలికి ప్రవేశించి ఎడమ వైపు నుండి అంటే చంద్రుని వైపు నుంచి.. కుడివైపునకు తొమ్మిది ప్రదక్షిణలు చేయడం ఉత్తమం. ప్రదక్షిణలు పూర్తయ్యాక కుడివైపు నుంచి ఎడమవైపు అంటే బుధుడి వైపు నుంచి... రాహువు, కేతువులను స్మరిస్తూ రెండు ప్రదక్షిణలు చేయవచ్చు.

చివరగా నవగ్రహాల్లో ఒక్కొక్క గ్రహం పేరు స్మరించుకుంటూ ఒక ప్రదక్షిణ చేసి, నవగ్రహాలకు వీపు చూపకుండా వెనుకకు రావాలి. ఇలా చేయడం వల్ల కొంత ఫలితం ఉంటుంది.

శివాలయాల్లో నవగ్రహాలుకు ప్రత్యేకమైన సన్నిధి వుంటుంది. మూలవిరాట్టును దర్శించుకుని బయటికి వచ్చాక నవగ్రహాలను దర్శించుకోవాలి. “ఆదిత్యాయ చ సోమాయ మంగళాయ బుధాయ చ గురు శుక్ర శనిభ్యశ్చ రాహవే కేతవే నమః” అంటూ తొమ్మిది ప్రదక్షిణలు చేయాలి.

ప్రదక్షిణాలు చేస్తున్నంత సేపూ నవగ్రహ స్తోత్రాలు చదవాలి. 9 గ్రహాలకూ స్తుతిస్తూ శ్లోకాలు చదివి 9 ప్రదక్షిణలు పూర్తి చేసిన తర్వాత ప్రత్యేకంగా రాహు, కేతువులకు మరో రెండు ప్రదక్షిణలు అంటే మొత్తం 11 చేస్తే చాలా మంచిదని చెప్పవచ్చు.

**సేకరణ**


# ప్రముఖాంధ్ర అభిమానులకు ఆహ్వానం, అభ్యర్థన!

ప్రముఖాంధ్ర గత 26 సంవత్సరాలుగా నిరాటంకంగా వస్తూనే వుంది. ఎందరో అభిమానులు ఏ పరిమాణంలో సహాయం అందించాలని ఫోన్లు చేస్తున్నారు? ‘వేలు’గా ఇవ్వ అవకాశం లేని అభిమానులున్నామంటున్నారు.

అలాటి మహోదయులకు, మహా హృదయులకూ పరిమితి లేదు, పరిధి లేదు. మీ శక్తికి తగినట్లు, మీ మనసుకు తోచినట్లు సహాయ సహకారము లందచేయండి! ప్రతా ఒక్క నీటిబొట్టూ కూడితేనే ప్రవాహమవుతుందీ, జీవనదీ అవుతూంది. చేరిన ప్రతీ నీటిబొట్టునూ దాచుకొని సాగరం తిరిగి మేఘమై, మేఘం వర్షమై చినుకు చినుకుగా భువినెలా సస్యశ్యామల కోమలం చేస్తూ పంటలను పండిస్తూందో – మేమూ అలానే మీ ప్రతీ ‘రూక’నూ ప్రముఖాంధ్రుల భాషా సేవకే వినియోగిస్తాం. ‘ప్రముఖాంధ్ర’ను పంట పొలంగా చేసి, తెలుగు అక్షర విత్తులను పండిస్తాం. ఇదే మా వినతి! ఇదే మా అభ్యర్థన. ఇదే మా హృదయపూర్వక ఆహ్వానం. పోస్టు ద్వారా ఉత్తరాలు వ్రాసి ఉన్న డబ్బులను కూడా హరింపచేయలేం. గ్రహించండి.

**రూ. 1001, 2001, 5001, 10,001, 25,001, 50,001 మీ ఇష్టం ఎంతైనా**

**ప్రముఖాంధ్ర బ్యాంక్ వివరాలు :**

| | | |
|---|---|---|
| Account Name | : | PRAMUKHANDHRA |
| Account No | : | 20011102592 |
| Bank | : | BANK OF MAHARASTRA, T.NAGAR |
| IFSC Code | : | MAHB 0000450 |

**ప్రముఖాంధ్ర**

64, తంబయ్యరెడ్డి వీధి, వెస్ట్‌మాంబళం, చెన్నై – 33.

మొబైల్ : 98400 48941



# తెలుగు సినిమా విజ్ఞానకోశం ... పేకేటి శివరాం

పేకేటి శివరాంని తెలుగు సినీ విజ్ఞాన సర్వస్వం అని అంటుంటారు. పేకేటికి సినిమా నిర్మాణం మీద వివిధ క్రాఫ్టుల పనితీరు మీద లోతైన పరిజ్ఞానముంది. తెలుగు చిత్రసీమలో అగ్రనటులైన ఎన్.టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు లకు అత్యంత సన్నిహిత మిత్రుడుగా, సలహాదారుగా పేకేటి మన్ననలు పొందారు. హిస్ మాస్టర్స్ వాయిస్ సంస్థలో ఆర్కెస్ట్రా ఇన్-చార్జ్ గా పనిచేస్తుండగా, మైక్‌కు అమరగాయకుడు ఘంటసాల కంఠం సరిపోదని హెచ్.ఎం.వి యాజమాన్యం నిర్ధారించినప్పుడు, ఘంటసాల సంగీత ప్రావీణ్యం మీద అచంచల విశ్వాసమున్న పేకేటి, తెగించి రికార్డులను ముద్రించి, విశేష ప్రచారమిచ్చి, సినీ నేపథ్యగాయకుడిగా నిలదొక్కుకునేందుకు కృషిచేసిన స్నేహశీలి పేకేటి. పేకేటి ఆనాడు ఆ సంచలన నిర్ణయం తీసుకొని వుండకపోతే ఘంటసాల గళం మనకు వినిపించి వుండేది కాదేమో! కన్నడ కంఠీరవుడు రాజకుమార్‌కు కూడా అత్యంత ప్రీతిపాత్రుడైన దర్శకుడు పేకేటి. నటుడుగా రాశిలో తక్కువ చిత్రాలలో నటించినా తనదైన 'మార్కు'ని ఎప్పుడూ నిలబెట్టుకుంటూనే వచ్చారు.

### సినీరంగ ప్రవేశానికి ముందు...

పేకేటి శివరాం అసలుపేరు పేకేటి శివరామ సుబ్బారావు. పుట్టింది అక్టోబరు 8, 1918 న భీమవరం దగ్గరలోని పేకేరు గ్రామంలో. ఆయన తల్లిదండ్రులు రాజేశ్వరమ్మ, కృష్ణమోహన్. కాలేజీలో చదివే రోజుల్లోనే పత్రికలకూ శివరాం వ్యాసాలు రాసేవారు. ఆయన రాసిన వ్యాసాలు 'నెరజాణ', 'మాధురి' వంటి పత్రికల్లో ప్రచురితమయ్యేవి. శివరాం మంచి క్రీడాకారుడు కూడా. కాలేజీలో అతడు ఫుట్ బాల్ చాంపియన్. సంగీతం మీద మక్కువ యెక్కువ కావడంతో హార్మోనియం, జలతరంగిణి వంటి వాద్యాలను వాయించడంలో తర్ఫీదు పొందారు. పద్యాలు బాగా పాడేవారు. నాటకాలు వేసేవారు. నాటకాల్లో వేషాలు కట్టినప్పుడు తాపీ ధర్మారావు నాయుడు వంటి నిష్ణాతుల మన్ననలు అందుకున్నారు. పేకేటి శివరాం కాలేజీ చదువులు పూర్తయ్యాక 1937లో మద్రాసు చేరుకున్నారు. అప్పుడు తాపీ ధర్మారావు నాయుడు సహకారంతో మద్రాసు రేడియో స్టేషన్ లో ప్రోగ్రాములు ఇచ్చేవారు. రచనా వ్యాసంగంలో పేకేటికి కాలేజి రోజులనుంచే మంచి అనుభవం ఉండడంతో, 'శ్రమజీవి' అనే పత్రిక సంపాదకుడు జైలుకు వెళితే ఆపద్ధర్మంగా ఆ పత్రిక సంపాదకత్వ బాధ్యతలు తన భుజాన మోశారు. అందులో పేకేటి సినిమాల మీద రాసే సమీక్షలు నిష్కర్షగాను, విమర్శనాత్మకంగాను ఉండేవి. టాకీ పులిగా పేరుగాంచిన ప్రముఖ నిర్మాత హెచ్.ఎం.రెడ్డి గారిని ఆ సమీక్షా వ్యాసాలు బాగా ఆకర్షించాయి. అప్పట్లో హెచ్.ఎం.రెడ్డి కి 'చిత్ర' అనే సినిమా పత్రిక కూడా వుండేది. ఇంటూరి వెంకటేశ్వరరావు ఆ పత్రికా నిర్వహణ బాధ్యతలు చూస్తుండేవారు. 1942లో రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో మద్రాసు నగరం మీద బాంబులు పడతాయనే వార్తలు రావడం, సినిమాల ముడి ఫిలిం దిగుమతికి అవరోధాలు ఎదురవడంతో అక్కడ సినిమా నిర్మాణం కుంటుపడింది. విజయా, వాహినీ వంటి ప్రసిద్ధ సినీ నిర్మాణ సంస్థ యజమానులు కూడా విరామం ప్రకటించి సొంత ఊళ్లకు పయనం కట్టారు. ఆ సమయంలో పనులు లేకపోవడంతో పేకేటి రాజమండ్రికి వచ్చేశారు. అక్కడ కొంతకాలం అగ్నిమాపక కేంద్ర కార్యాలయంలో తాత్కాలిక వుద్యోగం చేశారు. యుద్ధవాతావరణం సద్దుమణిగాక మరలా మద్రాసు చేరుకున్నారు. ఆరోజుల్లో బెంగుళూరు కేంద్రంగా 'సినిమా ఫ్లేమ్' అనే సినీ పత్రిక విడుదలయ్యేది. ఆ పత్రికకు మద్రాసు ప్రతినిధిగా పేకేటి పనిచేశారు. పేకేటి రాసే సినీ సమీక్షలు అందరినీ ఆకర్షించేవి. ఆరోజుల్లో డిటెక్టివ్ నవలలకు కూడా మంచి డిమాండ్ వుండేది. పేకేటి 'భగవాన్' అనే డిటెక్టివ్ పేరుతో పద్దెనిమిది నవలలు రాశారు.

### హెచ్.ఎం.వి గ్రామఫోను కంపెనీలో...

బెంగుళూరు సినీ పత్రికకు పనిచేస్తున్నప్పుడే పేకేటికి 'హిస్ మాస్టర్స్ వాయిస్' (హెచ్.ఎం.వి) గ్రామఫోను సంస్థలో తెలుగు విభాగం ఆర్కెస్ట్రా ఇన్ చార్జి గా ఉద్యోగం వచ్చింది. కష్టించే తత్వంగలవాడు కావడంతో పేకేటికి అందులో మంచి ఆదరణ లభించింది. సినిమా పాటల రికార్డింగు కోసం ఆరోజుల్లో హెచ్.ఎం.వి వారే తమ ఆర్కెస్ట్రా బృందాలను పంపుతుండేవారు. 1944లో ఘంటసాల సినిమాలో పాటలు పాడాలని మద్రాసు వచ్చి ప్రతిభా పిక్చర్స్ సంస్థ అధిపతి ఘంటసాల బలరామయ్య వద్ద చేరి 'సీతారామజననం' చిత్రంలో వేషాలు వేసేందుకు నెలజీతం మీద కుదురుకొని హెచ్.ఎం.వి లో రికార్డులు పాడాలని ప్రయత్నాలు సాగించారు. కానీ, లంకా కామేశ్వరరావు అనే అధికారి అతనికి ఆడిషన్ చేసి గొంతు మైకుకు పనికిరాదని పంపేయడం జరిగింది. కానీ ఆ కంఠం పేకేటికి నచ్చింది. ఘంటసాల కంఠాన్ని తిరస్కరించిన కామేశ్వరరావు సెలవులో వున్నప్పుడు పేకేటి ఘంటసాలను పిలిపించి "నగుమోమునకు నిశానాథ బింబము" అనే చాటు పద్యాన్ని, రతన్ రావు రచించిన "గాలిలో నా బ్రతుకు తేలిపోయినదోయి" అనే పాటను పాడించి రికార్డు చేసి విడుదల చేశారు. శివరాం అంచనాను నిజంచేస్తూ ఆ రికార్డు బాగా అమ్ముడుపోయింది. తన ప్రతిభను గుర్తించిన పేకేటికి ఘంటసాల ఎప్పుడూ కృతజ్ఞతలు తెలియజేస్తూ వుండేవారు. పేకేటి మద్రాసు వదలి కొంతకాలం ఢిల్లీ ఫిలిం డెవలప్మెంట్ కార్పోరేషన్ లో కూడా పనిచేశారు. పండిత జవహర్లాల్ నెహ్రూ పాల్గొన్న రాజకీయ ప్రసంగాలను చిత్రీకరించే అవకాశం పేకేటికి దొరకడం ఆయన చేసుకున్న అదృష్టం!

## సినీరంగ ప్రవేశం...

అంజలీ పిక్చర్స్ అధినేత పి. ఆదినారాయణరావు పిలుపుతో పేకేటి ఢిల్లీ నుండి మద్రాసు కు వచ్చి వారి సంస్థలో ప్రొడక్షన్ మేనేజరుగా చేరారు. అప్పట్లో పేకేటికి ఆదినారాయణరావు మూడువందల యాభై రూపాయలు జీతం ఇచ్చేవారు. అంత పెద్ద జీతం అందుకున్న తొలి మేనేజరు పెకేటే. 'మాతా' పబ్లిసిటీస్ పేరుతో పబ్లిసిటీ సంస్థను పెట్టి సినీ పబ్లిసిటీ కూడా చేశారు. అప్పుడే వినోదా సంస్థ వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో 'శాంతి' (1952) చిత్రం నిర్మించినప్పుడు అందులో పేకేటికి 'టామ్ టామ్' అనే జర్నలిస్టు పాత్రను పోషించే అవకాశం వచ్చింది. ఈ చిత్రానికి తన 'మాతా' సంస్థ తరఫున పబ్లిసిటీ కూడా పేకేటి అందించారు. ఈ సినిమాలో సావిత్రి సరసన కామెడీ పాత్ర పోషించిన పేకేటికి మంచి పేరు వచ్చింది. పేకేటికి ఇందులో 'టామ్ టామ్ చేరుకుంటుంటాం... ఉంటాం చీలిపోతుంటాం' అనే పాట కూడా వుంది. 'శాంతి' సినిమాలో రామచంద్ర కశ్యప, సావిత్రి, గోవిందరాజుల సుబ్బారావు, పేకేటి, హేమలత, కృష్ణవేణి ప్రధాన తారాగణం. ఈ సినిమాకు డి.బి. నారాయణ(నిర్మాత)తోబాటు సముద్రాల (గేయరచయిత), బి.ఎస్. రంగా(చాయాగ్రహణం), సి. ఆర్. సుబ్బురామన్ (సంగీత దర్శకత్వం) కూడా భాగస్తులుగా వున్నారు. 1953లో దర్శక నిర్మాత కె.ఎస్. ప్రకాశరావు ప్రకాష్ ఆర్ట్స్ సంస్థ మీద నిర్మించిన 'కన్నతల్లి' చిత్రంలో పేకేటి 'శర్మ' పాత్రను పోషించారు. అక్కినేని నాగేశ్వరరావు, నంబియార్, ఆర్. నాగేశ్వరరావు, జి. వరలక్ష్మి ప్రధాన తారాగణం కాగా సంగీత దర్శకుడు పెండ్యాల ఇందులో 'పెరుమాళ్ళు' అనే పాత్ర పోషించడం విశేషం. అలాగే యక్షగానం లో నృత్యం చేసిన రాజసులోచనకు, గాయని సుశీలకు కూడా ఇది తొలి చిత్రమే. అదే సంవత్సరం వినోదా పిక్చర్స్ వారు నిర్మించిన 'దేవదాసు' చిత్రం విడుదలైంది. అందులో అక్కినేనికి స్నేహితుడు 'భగవాన్' గా పేకేటి అపూర్వంగా నటించాడు. భగవాన్ దేవదాసుకి ధైర్యం నూరిపోస్తాడు. కలత చెందిన మిత్రునికి ఆనందాన్ని పంచాలని వేశ్య వద్దకు తీసుకు వెళ్తాడు. నిద్ర రావడానికి బ్రాంది అందిస్తాడు. అనూహ్యంగా అది దేవదాసుకి అలవాటుగా మారుతుంది. చంద్రముఖి (లలిత) వద్ద తను చేసినది తప్పని ఒప్పుకుంటాడు. తగిన ప్రాయశ్చిత్తం చేసుకుంటానని వెళ్తాడు. ఇది ఒక ఉదాత్తమైన పాత్ర. ఆ సన్నివేశంలో పేకేటి నటన అద్భుతంగా వుంటుంది. తరవాత 1954లో ప్రతిభా సంస్థ అధిపతి ఘంటసాల బలరామయ్య కుమారుడు కృష్ణమూర్తి పి. పుల్లయ్య దర్శకత్వంలో నిర్మించిన 'రేచుక్క' చిత్రంలో అన్నయ్య పాత్రలో పేకేటి నటించారు. అప్పుడే నిర్మాత హెచ్.ఎం. రెడ్డి నిర్మించిన 'వద్దంటే డబ్బు' చిత్రంలో పేకేటి ఎన్.టి. రామారావు ప్రాణమిత్రుడు 'రామ్' అనే కవి పాత్ర పోషించారు. జమున పేకేటికి జంటగా నటించింది. తరవాత వినోదా వారి 'కన్యాశుల్కం' (1955)లో పోలీసు కానిస్టేబుల్ గ్నా అదే సంస్థ నిర్మించిన 'చిరంజీవులు' చిత్రంలో 'రత్నం' అనే విలన్ పాత్రలోను నటించి తన ప్రతిభను చాటుకున్నారు. అంజలీ పిక్చర్స్ వారు వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో నిర్మించిన 'అనార్కలి' చిత్రంలో, 'సువర్ణసుందరి' లోకూడా పేకేటి హాస్యపాత్రలో నటించారు. చిత్తజల్లు పుల్లయ్య దర్శకత్వం వహించిన సోషియో ఫాంటసీ చిత్రం 'దేవాంతకుడు' లో పేకేటి (వి)చిత్రగుప్తుడు పాత్ర పోషించి మెప్పించారు. 'భీష్మ' (1962) చిత్రంలో విచిత్రవీర్యుడుగా నటించారు. ఇవి కాక భాగ్యరేఖ, పాండురంగ మహాత్మ్యం, పెళ్లినాటి ప్రమాణాలు, ఇల్లరికం, జయభేరి, గులేబకావళి కథ, గాలిమేడలు, బబ్రువాహన, మురళీకృష్ణ, వెలుగునీడలు వంటి చిత్రాలలో మంచి మంచి పాత్రలు పోషించారు. తరవాత పేకేటి శివరాం కన్నడ సినిమాలలో బిజీ అయిపోయారు. తెలుగు, కన్నడ, తమిళ చిత్రాలలోఅటు హాస్యనటుడిగా, ఇటు క్యారక్టర్ నటుడిగా వంద సినిమాలకు పైగా నటించారు.

– ఆచారం షణ్ముఖాచారి (వాట్సాప్ సేకరణ)


## పెరంబూరు తెలుగుసాహితీ సమితి సేవలు... అనన్య సామాన్యం

### - డాక్టర్ టి.మోహనశ్రీ ప్రశంస -

# పెరంబూరు తెలుగు సాహితీ సమితి 8వార్షికోత్సవం

తెలుగు భాష, సాహితీ కార్యక్రమాలతో అనన్య సామాన్యమైన సేవను పెరంబూరు తెలుగు సాహితీ సమితి చేస్తుందని ఎస్.కె.పి.సి. ప్రిన్సిపాల్ డాక్టర్ టి.మోహన శ్రీ ప్రశంసించారు

ఈమేరకు పెరంబూరులోని డి.ఆర్.బి.సి.సి. మహోన్నత పాఠశాల వేదికగా పెరంబూరు తెలుగు సాహితీ సమితి అష్టమ వార్షికోత్సవము శనివారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. సభకు సమితి అధ్యక్షులు తమ్మినేని బాబు అధ్యక్షత వహించారు.



గ్రంథాలను అవిష్కరిస్తున్న అతిథులు,నిర్వాహకులు

ఈ వార్షికోత్సవం సందర్భంగా సమితి వ్యవస్థాపక కార్యదర్శి, రచయిత రచించిన ఆత్మావలోకన, తెలుగులోకి అనువాదం చేసిన తిరుమూలర్ తిరుమందిరం అనే రెండు గ్రంథాలను ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ టి.మోహనశ్రీ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈ సమితి సేవలను చూస్తుంటే మహాత్మా గాంధీ మాటకు విలువ ఇచ్చేవారో గుర్తుకు వస్తుందని అన్నారు. మాటకు విలువ ఇచ్చి ఎనిమిదేళ్లగా తెలుగు భాషా సాహిత్యాలకు అనన్యమైన, బృహత్తర సేవ చేస్తున్నారని కొనియాడారు. భాషను మరవద్దని అది మరిస్తే మన సంస్కృతి సంప్రదాయాలు దెబ్బతింటాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

గౌరవ అతిథిగా పాల్గొన్న కేసరి మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య మాట్లాడుతూ ఓర్పు, సహనంతో పాటు భాషపై ఉన్న పట్టుతో వృద్ధాప్యంలోనూ టి.ఆర్.ఎస్.శర్మ రచనలు చేయటం ముదావాహం అని, మరిన్ని రచనలు చేయాలని కోరారు. రచయిత్రి డాక్టర్ ఆముక్త మాల్యద తిరుమూలర్ పుస్తకమును, ఆత్మావలోకన ప్రత్యేక సంచికను జ్యోస్తీ శేషగిరిరావులు సమీక్షించి, మంచి పుస్తకాలను రాశారని కొనియాడారు. జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య సమితి సేవలను ప్రశంసిస్తూ శుభాభినందనలు తెలిపారు. వార్షిక నివేదికను సమితి కార్యదర్శి టి.ఆర్.ఎస్.శర్మ సమర్పించారు. వ్యాఖ్యాతగా పి.ఆర్.కేశవులు వ్యవహరించారు. వసుంధరా దేవి ప్రార్థన గీతాన్ని ఆలపించగా, సీనియర్ న్యాయవేత్త జె. ఒగోటి పద్మ ప్రకాష్ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ●



# మంచి విషయాలు మనల్ని బలోపేతులుగా చేస్తాయి. మంచే మనిషికి జీవితాన్ని ప్రసాదిస్తుంది.


- స్వామి వివేకానంద



## జీ.వి. రావ్ పేజీ

(గోటేటి వేంకటేశ్వరరావు)

## శభాష్ గోపాల్ జీ



హిందూమతాన్ని కొంత మంది భ్రష్టు పట్టిస్తుంటే మన గోపాల్ వంటివారు దైవం విలువ తెలుసుకుని తమవంతు కైంకర్యం చేస్తూనే వున్నారు. చాలామంది యువత దేవాలయాలకు వెళ్ళటం తగ్గించేసారు. ఇంకొంతమంది నమ్మకం లేదంటున్నారు. కానీ ఈ గోపాల్ ఉన్నత చదువులు చదివి ఇప్పటి వరకు తొమ్మిది పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చేసారు. కాకినాడలలోని లింగంపర్తి గ్రామంలోని సీతారామ స్వామి దేవాలయం పురోహితునిగా వుంటున్నారు గోపాల్. ఈయన ఎమ్.ఎస్.సి. (సైకాలజీ), ఎమ్.ఏ. (ఫిలాసఫీ), ఎమ్.ఏ. (ఇంగ్లీష్), ఎమ్.కాం, ఎమ్.ఏ. (తెలుగు), ఎమ్.ఏ. (పొలిటిక్స్), ఎమ్.ఏ. (ఎకనామిక్స్), ఏమ్.ఏ. (లైబ్రరీయన్), ఎమ్.ఎడ్‌లు ఆంధ్రా యూనివర్సిటీ, నాగార్జున యూనివర్సిటీలో చేసారు. ఈయన భార్య డబుల్ ఏమ్.ఏ. కుమారుడు పదవ తరగతి చదువుతున్నాడు. ఇన్ని చదువుకుని ఎక్కడన్నా పెద్ద ఉద్యోగానికి వెళ్ళలేకపోయారా అని అడిగితే, తనయొక్క పూర్వీకులు 7 తరాలుగా స్వామివారి సేవలోనే వున్నారని తాను అదే కొనసాగిస్తున్నానని చెప్పారు. అంతేకాదు, ఆ వృత్తిని ఎంతో పవిత్రంగా భావిస్తున్నానని అది తన పూర్వజన్మ సుకృతమని చెపుతున్నారు. ఆయనకు గవర్నమెంట్ హాస్పిటల్, కాకినాడలో ప్రభుత్వ ఉద్యోగం దొరికినా వెళ్ళలేదు. ఉదయం 5 గంటల నుండి 11 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుండి 8 గంటల వరకు గుడిలో సేవ చేస్తూ, సైకాలజీ చదువుతున్నందు వల్ల చుట్టుపక్కల నున్న ప్రజలకు కౌన్సెలింగ్ ఇస్తూ వున్నారు. అంతేకాదు హిందూ మతం గొప్పదనాన్ని తెలియపరచటం తన కర్తవ్యంగా భావిస్తున్నారు వి.ఎస్.ఆర్. గోపాల్.

* * *

ప్రపంచ తెలుగు సమాఖ్య యువ జన విభాగం అధ్యక్షులు సతీష్. చాలా చురుకైన వ్యక్తి. సమాఖ్య కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ, యువజన విభాగం తరఫున పట్ల ఆసక్తికరమైన మంచి కార్యక్రమాలు చేసారు. అధ్యక్షులు శ్రీమతి ఇందిరాదత్‌గారి ఆదేశాలు మేరకు ప్రస్తుతం కొరోనా మహమ్మారి బారిన పడి అతలాకుతలమైన బడుగు వర్గాలు, వికలాంగులకు గోదావరి జిల్లా పరిసర ప్రాంతాలలో మూడు నెలలకు సరిపడా బియ్యం, పప్పుదినుసులు వగైరాలను అందించారు. ఈ మహత్తర





కార్యక్రమం శ్రీమతి ఇందిరాదత్ గారి సహాయ సహకారాల వల్లే చెయ్యగలిగానని తెలిపారు. అంతేగాక ఆయనో చారిటబుల్ ట్రస్టును స్థాపించి, చాలా కార్యక్రమాలు చేస్తున్నారు. కంగ్రాచ్యులేషన్స్, శుభాకాంక్షలు సతీష్

* * *

## ఆచార్య శివకుమారి షష్ఠి వేడుక



తెలుగు భాషాభిమాని, విశ్రాంత ఉపాధ్యాయిని డాక్టర్ శివకుమారి అరవై ఏళ్ళు పూర్తయిన సందర్భంగా వారి కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించిన వేడుకలకు నగరంలోని పలువురు ప్రముఖులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలంద జేసారు. ప్రతి తెలుగు సభలోను శివకుమారి గారిని చూడవచ్చు. తెలుగు భాషంటే అంతటి అభిమానం. లైన్స్‌క్లబ్ ద్వారాను ఆవిడ ఎన్నో సహాయ సహకారా లందించడమే కాక ఎన్నో గుప్తదానాలు చేసిన మహిళ. తన జీతంలో కొంత మొత్తాన్ని సేవా కార్యక్రమాల కోసం వినియోగించడం ఆవిడ ప్రత్యేకత. ముఖ్యంగా ఎంతోమంది విద్యార్థులకు ఫీజులను కట్టి తన సహాయాన్ని అందించారు. తన షష్టిపూర్తి సందర్భంగా ఒక స్కూలు విద్యార్ధికి ఫీజు, రెండు అనాథ శరణాలలో అన్నదానం నిర్వహించారు. చెన్నైలోని తెలుగు సంఘాల ప్రముఖులందరూ విచ్చేసిన ఆ కార్యకమంలో వారందరి కరతాళ ధ్వనుల మధ్య కేక్ కట్ చేసి తన పెట్టిన రోజును జరుపుకున్నారు. ●



# కనిగెలుపు (అజంతా) శంకరరావుకు అభినందనలు

వంద చేతులతో సంపాదించు

వెయ్యి చేతులతో దానం చెయ్యి – అధర్వవేదం

మానవులందరికి దానాన్ని పరమధర్మంగా పేర్కొన్నది – యజుర్వేదం

వీటిని సరిగ్గా ఆచరించే వ్యక్తి శంకరరావుగారు. విశాలహృదయుడు , మృదుస్వభావి , మితభాషి . చేస్తున్నాను అనే గర్వం రవ్వంతయినా లేనివారు. మా కుటుంబానికి అత్యంత ఆత్మీయులు. నాన్నగారికి మిక్కిలి ఇష్టులు. ఆయన వారి ధర్మపత్ని విజయలక్ష్మి మా ఇంటికి వచ్చి నాన్నగారిని పలకరించి వారి ఆశీస్సులు తీసుకుని వెళ్ళేవారు.

అజంతా శంకరరావుగారు 116 సంవత్సరాలు ఘనత వహించిన సదరన్ వైశ్య అసోసియేషన్ కు 13వ అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన సందర్భంగా ఆయనను అభినందిస్తూ, ప్రముఖాంధ్ర తరఫున శుభాకాంక్షలనందజేస్తున్నాం.

మహి ఎప్పుడు మంచివారిని గొలుచు , మంచివాడు లేకున్న మహి నిలువదు. అను సూక్తి ఋజు పరచిన వ్యక్తి శంకరరావు.

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA

REGN. No. TN/CC(S)DN/177/18-20
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97
**Posted at Egmore / RMS Pathrika Channal, posted between 5 - 8, October 2021**

